తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

కాళేశ్వరం బ్యారేజీల పై హైకోర్టు విచారణ
కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల అంశంపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్యే కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయిన విషయం తెలిసిందే.కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పిటిషనర్ ఆరోపణ. రైతుల ప్రయోజనాల కోసం ఎన్డీ ఎస్ ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించాలని వాదన. మిగిలిన రిజర్వాయర్లపై కూడా ఎన్డీఎస్ ఏ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, సుందిళ్ల పంప్హౌస్ల భద్రతపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్డీఎస్ ఏ తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 240 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శుక్రవారం, జులై 17, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

ఆగస్టు 15లోగా విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు: సీఎం రేవంత్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు ఆగస్టు 15లోగా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్లను అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో జడ్పీ గర్ల్స్ హైస్కూల్ కొత్త భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో విద్యా ప్రమాణాలను అధ్యయనం చేసేందుకు 50 మంది టీచర్లను విదేశాలకు పంపామని, ఈసారి మరో 150 మందిని సింగపూర్, సౌత్ కొరియా, ఫిన్లాండ్ దేశాలకు పంపుతున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో రోడ్డు భద్రతకు కొత్త బ్యూరో ఏర్పాటు: డిజిపి ఆనంద్ సివి ఆనంద్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో' ఏర్పాటుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. బ్యూరో ఏర్పాటు, విధులు, సిబ్బంది, చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై చర్చించారు.

ఇవాళ తొలి హైడ్రోజన్ ట్రైన్ జాతికి అంకితం

ఛండీఘడ్, జూలై 16: దేశంలోని తొలి హైడ్రోజన్ రైలును శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. హర్యానా పర్యటనలో భాగంగా ఈ ట్రైన్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. జింద్-సోనిపట్ మధ్య రాకపోకలు సాగించే ఈ ట్రైన్ భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలుగా నిలవనుంది. డీజిల్ రైళ్లకు ప్రత్యామ్నాయంగా, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతతో నడిచే ఈ రైలు కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తుంది. 10 కోచ్‌లతో రూపొందించిన ఈ రైలు, 3,200 హార్స్ పవర్ ప్రొపల్షన్ వ్యవస్థతో నడుస్తూ, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలవనుంది.ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మరో రూ. 14,700 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను కూడా మోదీ ప్రారంభించనున్నారు.. దీనివల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు తగ్గనుంది. కురుక్షేత్రలో సిక్కు గురువుల త్యాగాలను, సంస్కృతిని ప్రతిబింబించేలా సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.. రాష్ట్రవ్యాప్తంగా నూతన వైద్య కళాశాలలు, ఆనువత్రులను జాతికి అంకితం చేయనున్నారు.ఇక చండీగఢ్‌లో పర్యటనలో భాగంగా రూ. 6,600 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు. పీజీఐఎంఈఆర్ (ఖఉఎఓఇఖీ) అత్యాధునిక మాతృ, శిశు కేంద్రం, న్యూరోసైన్సెస్ కేంద్రాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. మొహాలీ-కురాలీ 6-లేన్ల హైవేతో పాటు, జిరాక్‌పూర్ బైపాస్‌కు శంకుస్థాపన చేయడం ద్వారా ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నారు.పంజాబ్ పర్యటనలో భాగంగా జలంధర్‌లో రూ. 5,470 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు.. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో ఆధునీకరించిన 75 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందులో జలంధర్ కంటోన్మెంట్ కూడా ఉంది. దౌలత్‌పూర్ చౌక్-కర్తోలి కొత్త రైలు మార్గం, అమృత్‌సర్-వారణాసి మధ్య కొత్త రైలు సర్వీసును ప్రారంభించడం ద్వారా ఆధ్యాత్మిక కేంద్రాల మధ్య అనుసంధానం మెరుగుపడనుంది.

బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో పారదర్శకత పాటించలేదు

కమిషన్ల కోసమే రాజీవ్ సాగర్ ని సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసింది నిజం కాదా ?
సీతమ్మసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు..
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర మంత్రులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి ,గురువారం అశ్వాపురం మండలంలో పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, కాలువల నిర్మాణం, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, సీతమ్మసాగర్ ప్రాజెక్టును నిర్దిష్ట గడువులో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.

ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుకు సంబంధించిన పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





మంత్రి పొంగిలేటి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత కమిషన్ల కోసమే రాజీవ్ సాగర్ ని సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసింది నిజం కాదా అని బిఆర్ఎస్ పార్టీని ప్రశ్నించారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..

సీతారామ ప్రాజెక్టు పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, కమిషన్ల రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. రాజీవ్ సాగర్ ప్రాజెక్టును కమిషన్ల కోసమే రీ-డిజైన్ చేశారని ఆయన ఆరోపించారు.

సీతారామ ప్రాజెక్టుపై నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఆరోపించారు, గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో పారదర్శకత పాటించలేదని, ప్రజాధనం వృథా అయ్యేలా వ్యవహరించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు.

అలాగే, సీతారామ ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలియ చేయాలి అన్నారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వేలాది ఎకరాలకు శాశ్వత సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి, రైతుల ఆర్థిక పురోగతికి కీలకంగా మారనుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని మంత్రులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సర్పంచులు, ఉపసర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు..
ఆషాడం తొలి పూజల్లో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం



గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రి కి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.

హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి సురేఖ గారు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు.



తెలంగాణ పవర్

సంపాదకీయం

శుక్రవారం, జులై 17, 2026

అమెరికా యూ టర్న్..

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ట సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్– డెమోక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది. అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ట పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది.ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది.గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి.రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది.రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ట సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది.ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమోక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్,డెమోక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహ–ప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు పొందే అవకాశం ఉంది.ఈ ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఆమోదం, అధ్యక్షుడి అంగీకారం లభించిన తర్వాతే ఇది చట్టంగా మారుతుంది. అందువల్ల, భారత్ సహా ఇతర దేశాలు ఈ బిల్లు పురోగతిని నిశితంగా గమనిస్తున్నాయి.


– ఎడిటర్

టెక్ మహీంద్రా క్యూ1 లాభాల జోరు

- రూ. 9,000 కోట్ల కొత్త డీల్స్, 53 శాతం పెరిగిన నిర్వహణ లాభం

హైదరాబాద్, జూలై 16, 2026: 'టెక్ మహీంద్రా' ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి త్రైమాసికంలో అత్యుత్తమ ఫలితాలు నమోదు చేసింది. జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి నిర్వహణ లాభం (ఈబీఐటీ) ఏడాది ప్రాతిపదికన ఏకంగా 53.3 శాతం వృద్ధితో రూ.2,264 కోట్లకు చేరింది. వరుసగా మూడు త్రైమాసికాలుగా బిలియన్ డాలర్ల మార్కును దాటుతూ ఈ త్రైమాసికంలోనూ సుమారు రూ.9,000 కోట్ల విలువైన సరికొత్త డీల్స్ దక్కించుకోవడం ద్వారా కంపెనీ తన పటిష్టమైన వృద్ధి పంథాను చాటుకుంది. ఈ సందర్భంగా టెక్ మహీంద్రా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మోహిత్ జోషి మాట్లాడుతూ ఏడాది ప్రాతిపదికన నమోదైన 6.1 శాతం వృద్ధితో పాటు వరుసగా మూడు త్రైమాసికాలలో మా కొత్త డీల్స్ విలువ ఒక బిలియన్ డాలర్లను అధిగమించడం మా వ్యాపార పటిష్టతను, మార్కెట్‌లో మా సేవలకు పెరుగుతున్న ఆదరణను స్పష్టం చేస్తోందన్నారు. మరో విషయం ఏమిటంటే, క్లయింట్లతో మా సంబంధాలు మరింత బలపడడం, యాభై మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ కేటగిరీలోని మా క్లయింట్ల సంఖ్య ఏడు పెరగడంతో పాటు అన్ని వ్యాపార విభాగాలు ఏడాది ప్రాతిపదికన చక్కని వృద్ధిని సాధించాయన్నారు.

ఈ సందర్భంగా టెక్ మహీంద్రా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రోహిత్ ఆనంద్ మాట్లాడుతూ ఈ మొదటి త్రైమాసికంలో అన్ని రంగాల్లో విస్తృతమైన వృద్ధి, మార్జిన్‌ల విస్తరణ, క్రమశిక్షణతో



కూడిన వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణతో అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఇది మా స్థిరమైన ప్రణాళికా అమలును, వ్యాపారంలో కొనసాగుతున్న జోరును ప్రతిబింబిస్తుందన్నారు. భవిష్యత్తు అవసరాలకు పూర్తి సన్నద్ధంగా ఉండే సంస్థగా ఎదిగేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. దీని కోసం విభిన్నమైన సామర్థ్యాలు, సావరిన్ ఏఐ, ప్లాట్‌ఫారమ్‌లు, నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులపై పెట్టుబడులను కొనసాగిస్తూనే... వృద్ధి, కార్యాచరణ క్రమశిక్షణపై స్పష్టమైన దృష్టిని సారిస్తున్నామని తెలిపారు.

అగ్రరాజ్యం ముప్పేట దాడి

న్యూఢిల్లీ, జూలై 16 (న్యూస్ పల్స్)అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం మరింత తీవ్ర స్థాయికి చేరబోతోంది. హోర్మూజ్ జలసంధి గుండా ఇరాన్ రాకపోకలను అమెరికా అడ్డుకుంది. హోర్మూజ్ జలసంధిలో ఇరాన్‌పై అమెరికా నావికా దళాలు దిగ్బంధనం చేశాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీని అర్థం, ఇరాన్ నౌకలు ఇకపై హోర్మూజ్ జలసంధిని దాటలేవు. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఈ ఘర్షణను మరింత తీవ్ర స్థాయికి తీసుకువెళ్లవచ్చు.యూఎస్ సెంట్రల్ కమాండ్ చీలో ఒక పోస్ట్‌ను షేర్ చేసింది. అందులో ఇలా పేర్కొంది, "ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతాల్లోకి ప్రవేశించే, బయలుదేరే నౌకలపై అమెరికా సైన్యం సముద్ర దిగ్బంధనాన్ని పునఃప్రారంభించింది. ప్రస్తుతం 20కి పైగా యూఎస్ నేవీ యుద్ధనౌకలు, వందలాది సైనిక విమానాలు మధ్యప్రాచ్యంలో మోహరించి ఉన్నాయి."అమెరికా మొదట ఏప్రిల్‌లో ఇరాన్‌పై దిగ్బంధనాన్ని విధించి, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే జూన్‌లో దానిని ఎత్తివేసింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల్లోగా ఇరాన్ అణు కార్యక్రమంపై శాశ్వత ఒప్పందానికి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు, కానీ హోర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చర్చలు ముందుకు సాగలేదు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం దిగ్బంధనాన్ని తిరిగి విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మొదట హోర్మూజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై 20 శాతం సుంకం విధించాలని ప్రతిపాదించినప్పటికీ, ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.హోర్మూజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన వాణిజ్య మార్గాలలో ఒకటి. యుద్ధానికి ముందు, ప్రపంచంలోని ముడి చమురు, గ్యాస్‌లో సుమారు 20 శాతం దీని ద్వారా వర్తకం జరిగేది. అయితే, అమెరికా–ఇరాన్ యుద్ధం ఈ మార్గాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఫలితంగా, యుద్ధం తర్వాత అనేక దేశాలలో చమురు, గ్యాస్ ధరలు పెరిగాయిపశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాలుస్తూ అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని పక్కనబెట్టి, ఇరాన్‌ను తమ నౌకాదళంతో మళ్లీ దిగ్బంధించబోతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దిగ్బంధం కేవలం ఇరాన్ నౌకలు, వారి ఖాతాదారుల రాకపోకలను మాత్రమే అడ్డుకుంటుందని, ఇతర దేశాల వాణిజ్య నౌకలు హర్మూజ్ జలసంధిని యథావిధిగా వాడుకోవచ్చని స్పష్టం చేశారు.ఇకపై అమెరికానే ఈ జలసంధికి సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిష్పక్షపాత భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే ఖర్చుల కోసం అక్కడ ప్రయాణించే అన్ని రకాల వాణిజ్య నౌకల సరకు విలువపై 20 శాతం చొప్పున పన్ను లేదా టోల్ వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సుంకాల వసూలు ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుందని, అమెరికా రక్షణలోనే హర్మూజ్ ఎప్పటికీ సురక్షితంగా తెరిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య కత్తులు దూసుకుంటున్న ఈ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

హరీష్ వ్యూహాత్మక మౌనమేనా



హైదరాబాద్, జూలై 16, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ఏ క్షణంలోనైనా తనే ముందుండి ప్రత్యర్థులపై వ్యతిరేక దాడి చేయడమే తప్ప, ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలో రాజకీయాలు చేసే అలవాటు లేని బలమైన నాయకుడు తన్నీరు హరీష్ రావు దీనికి ప్రధాన కారణం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయనపై పెద్దగా అవినీతి మరకలు లేకపోవడమే. గతంలో ఆయనపై వచ్చిన విమర్శలన్నీ కేవలం రాజకీయ కోణంలో చేసినవే తప్ప, పక్కా ఆధారాలతో ఆయన్ను ఇరకాటంలో పెట్టే స్థాయి ఆరోపణలు ఇప్పటి వరకు రాలేదు. కానీ, ప్రస్తుతం హరీష్ రావు తన రాజకీయ జీవితంలోనే మొదటిసారిగా సమాధానం చెప్పుకోవాల్సిన సంకట స్థితిలో పడ్డారు. ఈ వివాదానికి కేంద్ర బిందువు హరీష్ రావు సతీమణి యాజమాన్యంలోని మిల్చీ మిల్క్ డైరీ బ్రాండ్. ఈ కంపెనీ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు పంపిణీ చేసే వాటా చాలా పరిమితంగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రముఖ విద్యాసంస్థలు , కాలేజీలకే అత్యధికంగా పాలను సరఫరా చేస్తుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి, సదరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలను, ఆసుపత్రులను బెదిరించి బలవంతంగా ఈ బ్రాండ్ పాలను కొనుగోలు చేయించారనే తీవ్రమైన ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కల్వకుంట్ల కవితతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా నేరుగా ఇవే ఆరోపణలు గుప్పించడంతో ఈ అంశానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. హరీష్ రావు కుటుంబ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఆరోపణలు ఇలా సాగుతుండగానే, ఊహించని విధంగా మిల్చీ మిల్క్ అధికారిక వెబ్‌సైట్ హఠాత్తుగా ఇంటర్నెట్ నుండి డౌన్ కావడం ఈ వివాదాన్ని మరింత పెంచింది.వెబ్‌సైట్ డౌన్ చేయడానికి అఫీషియల్ క్లెంట్స్ పేజీలో ఉన్న బడా విద్యాసంస్థల లోగోలు, పేర్లను కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేయడమేనని తెలుస్తోంది. ఈ స్క్రీన్ షాట్లు నెట్టింట వైరల్ కావడంతో, హరీష్ రావు క్యాంప్‌లో కొంత కంగారు మొదలైందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. నిజంగానే అక్రమాలు జరగకపోతే వెబ్‌సైట్‌ను ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలను ప్రత్యర్థులు బలంగా సంధిస్తున్నారు. అయితే, తన రాజకీయ జీవితంలో ఎంతటి పెద్ద సంక్షోభాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొన్న హరీష్ రావు.. ఇంతవరకు ఈ మిల్చీ మిల్క్ వివాదంపై నేరుగా ఎక్కడా స్పందించలేదు. సాధారణంగా తనపై చిన్న విమర్శ వచ్చినా గణాంకాలతో సహా తిప్పికొట్టే హరీష్, ఈ ఫ్యామిలీ బిజినెస్ వివాదంలో వ్యూహాత్మక మౌనం వహించడం వెనుక ఉన్న కారణాలపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన ఈ అంశంపై గట్టిగా, పక్కా ఆధారాలతో స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో హరీష్ రావు కనుక ఈ ఆరోపణలను బలంగా తిప్పికొట్టి తన వాదనను ప్రజల ముందు ఉంచగలిగితే ఈ వివాదానికి బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఈ మౌనాన్ని ఇలాగే కొనసాగిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఒక బలమైన పొలిటికల్ అస్త్రంగా మలచుకుని, ఎల్లప్పుడూ క్లీన్ ఇమేజ్‌తో ఉండే హరీష్ రావును రాజకీయంగా కార్నర్ చేస్తూనే ఉండే ప్రమాదం ఉంది. ఏదేమైనా, ఎప్పుడూ డిఫెన్స్‌లో పడనని చెప్పుకునే హరీష్ రావుకు ఈ డైరీ వివాదం ఒక పెద్ద పరీక్షగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని భావిస్తున్నారు.

చైనాకు 14 దేశాల వార్నింగ్...

న్యూఢిల్లీ, జూలై 16, (న్యూస్ పల్స్)డ్రాగన్ కంట్రీ చైనా ప్రపంచంలో రెండో పవర్‌ఫుల్ దేశం. మొదటి స్థానం కోసం అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో అడ్డదారులు కూడా తొక్కుతుంది. ఈ క్రమంలో 2016, జూన్ 12 పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (పీసీఏ) తీర్పు వచ్చి పదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అమెరికా, జపాన్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జర్మనీ, ఇటలీ, ఎస్టోనియా, లాట్వియా, లిథువేనియా, న్యూజిలాండ్, రొమేనియా, స్లోవేనియా మొత్తం 14 దేశాలు ఒకటిగా ముందుకు వచ్చాయి. ఈ సంయుక్త ప్రకటనలో 2016 తీర్పును ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించి, అది చైనా, ఫిలిప్పీన్స్ మధ్య అంతిమమైనది, చట్టబద్ధంగా బంధించేలా ఉంది, నిర్ణయాత్మకమైనది అని స్పష్టం చేశాయి. చైనా విస్తృత సముద్ర హక్కుల వాదనలకు అంతర్జాతీయ చట్టం(యూఎన్సీఎల్ఓఎస్) ప్రకారం ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం లేదని వారు ధ్రువీకరించారు. శాంతియుత పరిష్కారం, బలవంతపు చర్యలను వ్యతిరేకించడం, నావిగేషన్, ఓవర్‌ఫ్లైట్ స్వేచ్ఛను కాపాడడం వంటి అంశాలను ఈ ప్రకటనలో నొక్కి చెప్పాయి.ఈ సంయుక్త ప్రకటనతో చైనా బాగా అసంతృప్తి చెందింది. బీజింగ్‌లోని జపాన్ ఎంబసీలోని చీఫ్ మినిస్టర్ (డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్)ను విదేశాంగ శాఖ అధికారి సమన్లు జారీ చేసి, తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేసింది. జపాన్ ఇతర దేశాలతో కలిసి తప్పుడు తీర్పును ముందుకు తెచ్చి, ప్రాంతీయ శాంతి–స్థిరత్వాన్ని దెబ్బతీస్తోందని, యుద్ధానంతర అంతర్జాతీయ వ్యవస్థను సవాలు చేస్తోందని చైనా ఆరోపించింది. జపాన్ ఈ వివాదంలో నేరుగా పాల్గొనే దేశం కాదు కాబట్టి దానికి చైనా సార్వభౌమాధికారం గురించి మాట్లాడే హక్కు లేదని చైనా పేర్కొంది. తన వాదనలను బలపరచుకోవడానికి చైనా సోషల్ మీడియాలో వీడియోను కూడా పంచుకుంది.ఈ తీర్పు 10వ వార్షికోత్సవం సందర్భంగా యూరోపియన్ యూనియన్ కూడా ప్రత్యేక ప్రకటన విడుదల చేసి, 2016 అవార్డును ముఖ్యమైనదిగా అభివర్ణించింది. యూఎన్సీఎల్ఓఎస్ ప్రకారం శాంతియుత పరిష్కారాలకు మద్దతు ఇచ్చింది.2016లో ఫిలిప్పీన్స్ చైనాపై దాఖలు చేసిన కేసులో పీసీఏ తీర్పు చైనా యొక్క "నైన్–డాష్ లైన్", చారిత్రక హక్కుల వాదనలను తిరస్కరించింది. ఈ తీర్పు ప్రకారం చైనా విస్తృత సముద్ర హక్కులకు అంతర్జాతీయ చట్టం కింద ఆధారం లేదు. చైనా ఈ తీర్పును ఎప్పటి నుంచో తిరస్కరిస్తోంది.దక్షిణ చైనా సముద్రం ప్రపంచ వాణిజ్యానికి అత్యంత ముఖ్యమైన రవాణా మార్గం. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు, సహజవాయువు రవాణా జరుగుతుంది. చైనా కృత్రిమ దీవుల నిర్మాణం, సైనిక కార్యకలాపాలు చేస్తోంది. ఫిలిప్పీన్స్ తన ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లో చైనా ప్రమాదకరమైన మాన్యూవర్లు చేస్తోందని ఆరోపిస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాల నౌకాదళ పర్యటనలు, చైనా గస్తీల మధ్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ సముద్ర చట్టాల అమలు, వాణిజ్య స్వేచ్ఛ వంటి అంశాలపై దృష్టి సారించాయి.

ఎస్ ఐ ఆర్ గడువు పొడగింపును వినియోగించుకోవాలి:కేఎల్ఆర్

ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు.ఆగస్టు 3 చివరి తేదీ... అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితారాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎఎఫీ) గడువును మరో పదిరోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును ఆప్ డేట్ చేసుకోవాలని కేఎల్ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి ఈఆరులకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు. డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ఈఆం లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి... సహకరించాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్న సూచించారు.

పీల్నాడు జిల్లాలో ఆలయంలో చోరీ..

హుండీ పగలగొట్టి నగదు అపహరణ..

నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలోని నూజెండ్లపల్లి అగ్రహారంలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.?స్థానిక వివరాల ప్రకారం, దుండగులు అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించి, గర్భాలయం సమీపంలో ఉన్న హుండీ తాళాన్ని ధ్వంసం చేశారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు.నగదు తీసుకున్న అనంతరం, ఖాళీ హుండీని సమీపంలోని పొలాల్లో పడేసి పరారయ్యారు.?గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న గ్రామస్థులు హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న నాదెండ్ల పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయితీలకే పరిమితమవుతున్న మీనాక్షి

వరంగల్, జూలై 16, (న్యూస్ పల్స్) తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీని అంతర్గత విభేదాలు, వరుస వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై దృష్టి సారించడం పక్కన పెట్టి, నేతల మధ్య కుమ్ములాటలను సర్దుబాటు చేయడానికే హైకమాండ్ ప్రతినిధుల సమయం అంతా సరిపోతోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే తయారైంది. ఆమె గాంధీ భవన్‌కు వచ్చినప్పటి నుండి నియోజకవర్గాల వారీగా ఉన్న 'పంచాయితీ'లను పరిష్కరించడానికే తన శక్తినంతా ధారపోయాల్సి వస్తోంది. ఇప్పటికే కామారెడ్డి, తుంగతుర్తి, గజ్వేల్ నియోజకవర్గాల్లోని వర్గపోరు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారగా, తాజాగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్, అలాగే కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి వివాదాలు పార్టీలో మరింత అగ్గి రాజేసాయి. ఈ సమస్యలన్నింటినీ సెట్ చేయడానికి మీనాక్షీ నటరాజన్ వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. దీనివల్ల ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించే అవకాశం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే వ్యూహాలు అమలు చేసే సమయం ఆమెకు దొరకడం లేదనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నడుస్తున్న నలిగిపోతున్న వివాదమే. ఈ ఇద్దరు సీనియర్ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న పరిస్థితులపై మీనాక్షీ నటరాజన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గాంధీ భవన్‌లో మంత్రి కొండా సురేఖ, మీనాక్షీ నటరాజన్‌తో సుమారు 15 నిమిషాల పాటు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కడియం శ్రీహరి వైఖరిపై, ఆయన వ్యవహరిస్తున్న తీరుపై గతంలో తామిచ్చిన ఫిర్యాదు లేఖను ఈ సందర్భంగా సురేఖ మరోసారి ఇంచార్జ్ ముందుంచారు. మరోవైపు, కడియం శ్రీహరి మాత్రం ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు అస్సలు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. తాను ఎలాంటి పొరపాటూ చేయలేదని, కేవలం తన నియోజకవర్గ పనులపై సమీక్ష నిర్వహిస్తే, దాన్నేదో పెద్ద నేరంగా చిత్రీకరిస్తూ కొండా సురేఖ రాద్ధాంతం చేస్తున్నారని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. తనలాంటి సుదీర్ఘ



రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడిని అనవసరంగా వివాదాల్లోకి లాగడం వల్ల వ్యక్తిగతంగా తనకే కాకుండా, పార్టీకి కూడా పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని ఆయన వాదిస్తున్నారు. ఈ వివాదంపై ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఇప్పటికే పూర్తి నివేదికను సిద్ధం చేసి పార్టీ హైకమాండ్‌కు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మంటలు చల్లారడం లేదు. ఒకవైపు వరంగల్ రాజకీయం ఇలా ఉంటే, మరోవైపు తుంగతుర్తి నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విభేదాలు కూడా పార్టీని ఇరకాటంలో పడేస్తున్నాయి. ఈ తుంగతుర్తి ఎపిసోడ్‌కు సంబంధించి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని పిలిపించి మీనాక్షీ నటరాజన్ సుదీర్ఘంగా మాట్లాడారు. నియోజకవర్గంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలే తప్ప, వ్యక్తిగత విభేదాల జోలికి వెళ్లొద్దని ఆమె ఎంపీకి గట్టిగానే సూచించారు. ఇదే సమయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్ పార్టీకి మరో పెద్ద తలనొప్పిగా మారింది. శివచరణ్ వ్యవహార శైలిపై సీనియర్ నేతలు మధుయాష్కీ, ఈశ్వరమ్మ వంటి వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా చాలా సీరియస్‌గా తీసుకున్నారు. అయితే, ఈశ్వరమ్మపై తాను చేసిన వ్యాఖ్యలకు గానూ శివచరణ్ రెడ్డి ఇప్పటికే బహిరంగంగా క్షమాపణలు చెప్పినప్పటికీ, పార్టీ అంతర్గత క్రమశిక్షణపై ఈ ఘటన ప్రభావం చూపించింది. అధికారంలో ఉన్న పార్టీగా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లడం, పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడం ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ ప్రధాన బాధ్యత కావాలి. కానీ, దురదృష్టవశాత్తూ నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు, ఈగో క్లాషెస్ కారణంగా ఆమె సమయమంతా గాంధీ భవన్‌లో రాజీ పంచాయితీలు చేయడానికే సరిపోతోంది. కామారెడ్డి, గజ్వేల్, తుంగతుర్తి, వరంగల్.. ఇలా ఏ నియోజకవర్గం మీనాక్షీ నటరాజన్ ఎంతగా ప్రయత్నిస్తున్న ప్పటికీ ఈ అంతర్గత కుమ్ములాటలు ఎంతవరకు సర్దుమణుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. నేతలు తమ వ్యక్తిగత పంతాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం వైపు దృష్టి సారించకపోతే.. ఇంచార్జ్ ఎన్ని కమిటీలు వేసినా, ఎన్ని గంటలు చర్చలు జరిపినా ఫలితం శూన్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సైబర్ బాధితులకు భారీ ఊరట..

నేరగాళ్లు కొట్టేసిన డబ్బు తిరిగి వెనక్కి..

హైదరాబాద్, జూలై 16, (న్యూస్ పల్స్)సైబర్ మోసాలకు గురై డబ్బు కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శుభవార్త చెప్పింది. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అధికారిక మెసేజ్ అందుకున్న వారు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. బ్యాంకులు, చట్ట అమలు సంస్థల ధ్రువీకరణ తర్వాత అర్హులైన వారి ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ కానుంది. సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గుడ్‌న్యూస్ చెప్పింది. బాధితులు తమ డబ్బును సులభంగా తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్‌ఎం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా అర్హులైన బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనే రీఫండ్ కోసం దరఖాస్తు చేసుకుని.. నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలోకి డబ్బు పొందే అవకాశం కల్పించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఐపీఎస్ అధికారి శిఖా గోయెల్ ఈ వివరాలు వెల్లడించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) నుంచి రీఫండ్‌కు సంబంధించిన అధికారిక ఎస్‌ఎంఎస్ లేదా నోటిఫికేషన్ అందుకున్న బాధితులు మాత్రమే ఈ మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ సేవను వినియోగించుకోవచ్చు. బాధితుల అభ్యర్థనను చట్ట అమలు సంస్థలు, సంబంధిత బ్యాంకులు ధృవీకరించిన తర్వాత అర్హత ఉన్న వారి ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయనున్నారు. దరఖాస్తు విజయవంతంగా నమోదైనట్లు మెసేజ్ వచ్చిన తర్వాత.. ధృవీకరణ పూర్తయ్యాక డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరోసారి అలర్ట్ చేసింది. రీఫండ్ త్వరగా ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్లను నమ్మవద్దని హెచ్చరించింది. ఓటీపీలు, బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలు లేదా ఇతర గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని సూచించింది. రీఫండ్ కోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో సహాయం అవసరమైన బాధితులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెల్ప్‌డెస్క్‌ను లేదా తమ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారిని నేరుగా సంప్రదించాలని సూచించింది.

హైడ్రా వేటలో రియల్ ఎస్టేట్ రాముడు టార్గెట్

తెలంగాణ రాజకీయాల్లో తెర వెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్, జూలై 16, (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగరంలో చెరువుల సంరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా చర్యలు రోజురోజుకూ సరికొత్త పొలిటికల్ టర్న్ తీసుకుంటున్నాయి. కేవలం సాధారణ నిబంధనల ఉల్లంఘనల ఆధారంగానే కాకుండా, ఒక పక్కా వ్యూహం ప్రకారం బడా ప్రాజెక్టులపై హైడ్రా విరుచుకుపడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ప్రదీప్ బిల్డర్స్, సంధ్యా కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్ రావుకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రతిష్టాత్మక నిర్మాణాలను హైడ్రా టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయనే చర్చ రియల్ ఎస్టేట్ వర్గాల్లో జోరందుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో తెరపైకి వస్తున్న అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైడ్రా విరుచుకుపడుతున్న ఈ బడా ప్రాజెక్టులన్నింటికీ ఒక అంతర్గత లింక్ ఉందనే ప్రచారం సాగడం. ఈ లింక్ నేరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వైపు కనెక్ట్ అవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇటీవల సోషల్ మీడియా వేదికగా విసిరిన కొన్ని పరోక్ష విమర్శలు, రియల్ ఎస్టేట్ రాముడు అంటూ పెట్టిన నిక్ నేమ్ ఈ చర్చలకు మరింత ఆజ్యం పోశాయి. గత ప్రభుత్వ హయాంలో ఐటీ, మున్సిపల్ శాఖల నీడన సాగిన కొన్ని బడా రియల్ ఎస్టేట్ లావాదేవీల చిట్టా ఇప్పుడు బయటకు వస్తోందనే సంకేతాలు దీని ద్వారా వ్యక్తమవుతున్నాయి. నిజానికి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని స్థాయికి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే తెరవెనుక అనేక భారీ ఆర్థిక లావాదేవీలు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధుల మార్పులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ ఇన్ అండ్ అవుట్ లావాదేవీలపై, ఎవరెవరికి వాటాలు వెళ్లాయనే దానిపై పక్కా సమాచారం ఉంటుంది. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత, వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల ఆయా సంస్థల అంతర్గత సమాచారం, పాత లీకులు కొత్త ప్రభుత్వ పెద్దల చేతికి చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లీకుల ఆధారంగానే, గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ నిబంధనలను బేఖాతరు చేసిన సదరు బడా బిల్డర్ల ప్రాజెక్టులనే హైడ్రా ఇప్పుడు ప్రత్యేకంగా టార్గెట్ చేస్తోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు.. గత పాలకుల ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఒక వ్యూహాత్మక పొలిటికల్ అటాక్ అని భావిస్తున్నారు. ఎక్కడైతే గత ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలు లేదా బినామీ హస్తాలు ఉన్నాయని అనుమానాలు ఉన్నాయో, సరిగ్గా ఆయా కట్టడాల వద్దకే హైడ్రా బుల్డోజర్లు వెళుతుండటం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది. ఇప్పుడు అందరినీ వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న.. ఈ హైడ్రా వేట ఇంతటితో ఆగిపోతుందా? లేక తెరవెనుక ఏవైనా బ్యాక్ గ్రౌండ్ సెటిల్మెంట్లు జరుగుతాయా? అనేది. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి భారీ దాడులు జరిగినప్పుడు, సదరు వ్యాపారులు నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ పెద్దలతో సయోధ్య కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తుంటారనేది ఓ బహిరంగ రహస్యం. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో హైడ్రా నిజంగానే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుని, ఈ బడా ప్రాజెక్టుల వెనుక ఉన్న అసలైన సూత్రధారులను చట్టం ముందు నిలబెడుతుందా.. లేదా కేవలం రాజకీయ మైలేజ్ కోసమే ఈ రచ్చ సాగుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి. హైడ్రా తీసుకుంటున్న ఈ దూకుడు నిర్ణయాలు అటు బీఆర్ఎస్ అగ్ర నాయకత్వానికి, ఇటు భాగ్యనగర రియల్ ఎస్టేట్ మాఫియాకు ఒక బలమైన హెచ్చరిక లాంటివని రాజకీయవర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి.

కేంద్రంతో సయోధ్యకి రేవంత్

హైదరాబాద్, జూలై 16, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత సామెత. కానీ, కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉంటే.. నిత్యం కత్తులు దూసుకోవడం, సవాళ్లు విసురుకోవడం భారత రాజకీయంలో మనం తరచూ చూసే నిత్యకృత్యం. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ లేదా ఇతర ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాల మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణమే కనిపించేది. గతంలో తెలంగాణలోనూ ఇదే తరహా 'ఢీ అంటే ఢీ' అనే రాజకీయాలు నడిచాయి. అయితే, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పాత పంథాకు పూర్తిగా స్వస్తి పలికింది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవచ్చనే సరికొత్త రాజకీయ ఒరవడికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్నికల రణక్షేత్రంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే రాజకీయ వైరాన్ని కొనసాగిస్తే నష్టపోయేది రాష్ట్ర అభివృద్ధి, ప్రజలేనని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిత్యం తలపడే ధోరణిని పక్కనబెట్టి, సామరస్య పూర్వక వైఖరిని అవలంబిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి వరుసగా కలుస్తున్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన చట్టం హామీలను వారికి వివరంగా వివరిస్తున్నారు. కేంద్రం నుంచి ఆమోద ముద్ర పొందేలా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలను సైతం కలుపుకుంటూ, వారి ద్వారా కూడా ఒత్తిడి తెచ్చే వ్యూహాత్మక పంథాను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో 'పెద్దన్న' అని సంబోధించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయ్యి ఉండి మోడీని అలా కొనియాడడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. అయితే దీనిపై రేవంత్ రెడ్డి అత్యంత స్పష్టతతో సమాధాన మిచ్చారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ప్రధానే పెద్ద దిక్కు కాబట్టి, ఆ కోణంలోనే తాను 'పెద్దన్న' అన్నానని, అంతేకానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తానేనాడూ రాజీ పడబోనని కుండబద్దలు కొట్టారు. అవసరమైనప్పుడు హక్కుల కోసం కొట్లాడతామని, మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రధాని మోడీ కూడా సానుకూల వైఖరితోనే ఉన్నట్లు కనిపిస్తోంది. "తనతో కలిసి పనిచేసి చూడు.. రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్తాం" అంటూ మోడీ బహిరంగంగానే రేవంత్‌కు పిలుపునివ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మోడీ ఇలా రేవంత్‌కు గాలం వేస్తున్నారనే ప్రచారాలు సాగినా, వాటన్నింటినీ రేవంత్ రెడ్డి తనదైన శైలిలో తిప్పికొట్టారు. తన దృష్టంతా కేవలం తెలంగాణ అభివృద్ధి పైనేనని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఘర్షణ వాతావరణాన్ని పక్కన పెట్టడం, దానికి తగ్గట్టే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు అవసరమైన సహాయసహకారాలు అందించడం ఒక సానుకూల పరిణామం. కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉండాల్సిన ఫెడరల్ స్ఫూర్తికి ఇది ఒక కొత్త నిర్వచనంగా నిలుస్తోంది. ఎన్నికల సమయంలో ఎంతటి రాజకీయ శత్రుత్వమైనా ఉండొచ్చు, కానీ పాలనలోకి వచ్చేసరికి ప్రజల బాగు కోసం కలిసి నడవాలనే రేవంత్ రెడ్డి సూత్రం తెలంగాణ ప్రయోజనాలకు ఎంతవరకు లాభిస్తుందో చూడాలి. ఏదేమైనా, కేంద్రంతో నిత్యం యుద్ధం చేసే పాత పంథాకు భిన్నంగా రేవంత్ రెడ్డి తెచ్చిన ఈ సరికొత్త రాజకీయ ఒరవడి ప్రస్తుతానికి తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఆసక్తికరమైన, లోతైన చర్చకు దారితీస్తోంది.

అమాత్య..భాగ్యమెప్పుడు...

హైదరాబాద్, జూలై 16, (న్యూస్ పల్స్)సినిమాల్లో లేడీ అమితాబ్‌గా, రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన విజయశాంతి శైలి ఎప్పుడూ విలక్షణమే. ఏ పార్టీలో ఉన్నా తనదైన ముద్ర వేయాలనుకునే ఆమె, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సొంత ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా షాబాద్ మర్డర్ల కేసులో పోలీసుల తీరును, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను ఆమె బహిరంగంగా తప్పుబట్టడం హస్తం పార్టీని తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. అయితే, ఈ విమర్శల వెనుక శాంతిభద్రతల పరిరక్షణ కంటే, ఆమె వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలు స్వపక్షం నుంచే బలంగా వినిపిస్తున్నాయి. విజయశాంతికి ఉన్న మాస్ ఇమేజ్, కరిష్మాను చూసి అన్ని రాజకీయ పార్టీలూ ఆమెను సాదరంగా ఆహ్వానిస్తూ ఉంటాయనేది బహిరంగ రహస్యం. కానీ, ఆమె ట్రాక్ రికార్డును పరిశీలిస్తే క్షేత్రస్థాయి రాజకీయాలకు ఆమె చాలా కాలంగా దూరంగా ఉంటున్నారనే వాస్తవం స్పష్టమవుతుంది. ప్రజల పక్షాన నిలబడి రోడ్లపైకి వచ్చి పోరాడిన దాఖలాలు, లేదా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భాలు ఇటీవలి కాలంలో ఎక్కడా కనిపించలేదు. కేవలం సోషల్ మీడియా వేదికగా అడపాదడపా పోస్టులు పెట్టడానికే ఆమె పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఆ పోస్టులు సైతం పార్టీకి మైలేజ్ తెచ్చేలా కాకుండా, ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేలా ఉండటం గమనార్హం. కేవలం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించకుండా పదవులు ఆశించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు సొంత పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాల వెనుక విజయశాంతి సుదీర్ఘ నిరీక్షణ, అసంతృప్తి దాగి ఉన్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకు మంత్రి పదవి దక్కాలని ఆమె ఎంతో కాలంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే, సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకునే అధిష్ఠానం ఆమెకు ఆ అవకాశం కల్పించలేకపోయింది. దీంతో ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే విజయశాంతి వ్యూహాత్మకంగా అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. సంక్షోభ సమయాల్లో ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చేలా సొంత పార్టీ నేతే వ్యవహరించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలాంటి ఒత్తిడి రాజకీయాల ద్వారా అధిష్ఠానాన్ని బెదిరించి తన పంతం నెరవేర్చుకోవాలని ఆమె చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో పలు పార్టీలు విజయశాంతి కరిష్మాను చూసి ఆమె ఒత్తిళ్లకు లొంగి ఉండవచ్చు.

వెంకన్న సన్నిధి... వికలాంగుల పెన్నిధి

తిరుమల వెళ్లలేని దివ్యాంగుల కోసం "ట్రస్ట్"? సాయం

ఖర్చులన్నీ వాళ్లవే

ఏడుకొండలవాడి చెంతకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తోన్న "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"

హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భారత పుణ్యక్షేత్రాలలో "తిరుమల" ఒకటి. ఏడుకొండలపై విష్ణుమూర్తి అవతారంలో కొలువై ఉన్న ఆ వేంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం ఎంతో మంది భక్తులు తరలి వెళ్తుంటారు. ఆ కోనేటి రాయుడిని కనులారా చూసి, మనసారా వేడుకుంటారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకుంటుంటారు. అయితే, చాలా మంది భక్తులు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా దర్శించుకుంటే మరి కొద్దిమంది మాత్రం జీవితంలో ఒక్కసారి దర్శించుకున్నా చాలని కోరుకుంటారు. ఈ క్రమంలోనే ఒక్కసారి కూడా ఏడుకొండలవాడిని చూసుకోలేని వారికి అండగా నిలుస్తోంది ఓ సంస్థ. అదే "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్". నిరుపేదలు, దివ్యాంగులకు ఆ శ్రీనివాసుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది. తిరుపతి వెంకన్నను దర్శించుకోవాలని చాలా మందికి ఉంటుంది. అయితే, చేతిలో డబ్బులు లేని కారణంగా కొద్దిమంది ఆ కోరికను తుంచుకుంటే దివ్యాంగులు వాళ్ల లోపం కారణంగా వెళ్లలేకుంటారు. అలాంటి వారందరికీ తిరుమలేశుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్".

హైదరాబాద్?కు చెందిన చుక్కల వేణుకుమార్? అనే వ్యాపారికి ఒకరోజు "ఒక్కసారైనా తిరుమల దర్శనం చేసుకోని వాళ్లుంటారా?" అనే సందేహం వచ్చిందట. ఆ క్రమంలోనే ఓసారి నాగోల్‌లో ఉన్న ఒక గుడికి వెళ్లినప్పుడు "తిరుపతికి వెళ్లని వాళ్లున్నారా" అంటూ మైక్‌లో అడిగించారట. దీంతో "మేం వెళ్లలేదు" అని చాలా మంది చెప్పడం చూసి ఆశ్చర్యపోయారట. దాంతో తన సొంత డబ్బులతోనే కొందరు మురికివాడ ప్రజల్ని ఏడుకొండలు ఎక్కించారు వేణుకుమార్. తిరుమలకి వెళ్లాలని ఉన్నా పేదరికంతో వెళ్లలేనివారి కోసమే స్నేహితులతో కలిసి 2014లో "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"ను ఏర్పాటు చేశారు.

ఖర్చులన్నీ ట్రస్ట్? తరఫునే

సమాజంలోని పేదలు, దివ్యాంగులకు ఆధ్యాత్మిక సేవలు అందించే ఒక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇది. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కొండను సందర్శించి, శ్రీవారిని దర్శించుకోవాలని ఆశపడే దివ్యాంగులు, అంధులు, అనాథలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు, జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తిరుమల కొండను సందర్శించని భక్తులకు ఈ ట్రస్ట్ పూర్తిగా ఉచితంగా తిరుపతి యాత్రను ఏర్పాటు చేస్తుంది. భక్తులకు తిరుమల వెళ్లడానికి రానూపోనూ ఛార్జీలూ, వసతి, భోజనం అన్నీ వాళ్లే చూసుకుంటారు.

వాలంటీర్లు కూడా సిద్ధం

ఈ ట్రస్ట్‌లో "గరుడ సేన" అనే వాలంటీర్ల బృందం పనిచేస్తుంది. తిరుమల యాత్రకు వచ్చే దివ్యాంగులకు, వృద్ధులకు కొండపై నడవడానికి, వీల్ చైర్ సదుపాయం కల్పించడానికి, సురక్షితమైన దర్శనం చేయించడానికి ఈ వాలంటీర్లు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారు. టీటీడీ బోర్డు సాయం ఈ ట్రస్టు సేవలకి సాయంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఉచిత వసతి, దర్శన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకూ సుమారు 3000 మంది భక్తులకు వెంకన్న దర్శనభాగ్యం కల్పించిందీ ట్రస్టు. ఈ ఉచిత సేవలను పొందడానికి ట్రస్ట్ అధికారిక మార్గాల ద్వారా ముందే పేరు నమోదు చేసుకోవాలి. అందుకోసం ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్ బజీబఇఇబి.నీతీణ లో లేదా వారి వాట్సాప్ నెంబర్ 96661 59999 అందించే గూగుల్ ఫారమ్‌ను పూరించాలి. అప్లై చేసుకునే సమయంలో భక్తుని ఆధార్ కార్డ్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికేట్ లేదా నిరుపేదలయితే రేషన్ కార్డ్ జిరాక్స్?లను అందించాలి.

నిలుచున్న చోటే ప్రసవం

కిందపడిన శిశువుకు గాయాలు

భద్రాద్రి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళను అక్కడి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో గర్భిణి నిల్చున్న చోటే బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బిడ్డ పుట్టాక కూడా 10 నిమిషాల వరకు వైద్యులు రాలేదని కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటన చూసి ఇతర రోగులు భయాందోళనకు గురైయారు.

అవినీతికి పాల్పడితే రెండో ఛాన్స్ ఉండదు : తమిళనాడు సీఎం విజయ్



తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు.ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్ కావడంతో.. రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు.ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్.. అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. ఈ క్రమంలో మొన్న కరూర్‌లో ఇటీవల నిర్వహించిన ప్రజాసభలో మాట్లాడుతూ.. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి ఏమాత్రం తావుండబోదని తేల్చిచెప్పారు.'ఎవరైనా లంచం అడిగితే 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెంటే నేను ఉంటాను.అయినా ఒత్తిడి చేస్తే ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మావెన్నంటి ఉన్నారని ధైర్యంగా చెప్పండి' అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. అవినీతి,లంచాలు,అధికారదుర్వినియోగానికిపాల్పడేవారినిఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ఇక అవినీతి నిర్మూలన కోసం విజయ్ ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

నాగార్జున సాగర్ విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన



నందికొండ, జూలై 16 : వైటీపీఎస్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిరసిస్తూ టీజీపీఈఏ జేఏసీ పిలుపు మేరకు నాగార్జున సాగర్ విద్యుత్ కేంద్రంలో గత 22 రోజులుగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను రూ.255 కోట్లతో మూడేళ్ల పాటు ప్రైవేటుకు అప్పగించే టెండర్ ప్రక్రియ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం 22వ రోజు భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి, ప్రధాన గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో కీలకమైన విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు పనిభారం పెరగడం, అనుభవజ్ఞులైన నైపుణ్యాన్ని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.వైటీపీఎస్ ప్లాంట్ నందు ఉన్న ఏహెచ్‌పీ అండ్ సీహెచ్‌పీల ప్రైవేటీకరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్య రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలను ఔట్ సోర్సింగ్ లేదా ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు నాంది కావచ్చునని, తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఇంజినీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా ప్రభుత్వ తీరు : ఎంపీ వద్దిరాజు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులపై ఖండన

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జూలై 16 : ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన "చలో మణుగూరు" పిలుపునకు భయపడి కొత్తగూడెం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్భందించడాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం తీవ్రంగా ఖండించారు. పోలీసుల చర్య ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా ఉందని, ప్రతిపక్ష నాయకుల గొంతులను పోలీసులను అడ్డం పెట్టుకుని అణచివేయాలనే ప్రయత్నాలు ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. సమాజంలో ప్రశ్నించే వారిని భయపెట్టడానికి, పోలీసులు చేసే ఇలాంటి చర్యలు ప్రతిపక్ష నాయకుల్లో మరింత కసిని పెంచుతాయన్నారు. పోలీసులు తక్షణమే అక్రమ అరెస్టులు ఆపాలని, ఇప్పటికే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు.



కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బల్కంపేట ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ : సనత్‌నగర్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ ఆలయం తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే ఎంతగానో అభివృద్ధి చెందిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారుగురువారం ఆయన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఆలయ



ఆవరణలో చేనేత సంఘం ఆధ్వర్యంలో 21 వ తేదీన కళ్యాణం సందర్భంగా అమ్మవారికి సమర్పించనున్న చీరను మగ్గంపై తయారు చేసే పనులను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎవరు ఊహించని స్థాయిలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, పరిసర ప్రాంతాల్లో ఎంతో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 2014 కు ముందు అమ్మవారి కళ్యాణాన్ని ఆలయం లోపల నిర్వహించేవారని, 15 నుంచి 20 వేల మంది భక్తులు వచ్చేవారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ ట్రస్టీ సాయిబాబా గౌడ్, సనత్ నగర్, అమీర్ పేట డివిజన్ ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, రమేష్ గౌడ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, వనం శ్రీనివాస్, సుమిత్ సింగ్, గోపీలాల్ చౌహన్, అఖిల భారత చేనేత కళావైభవం సభ్యులు జయరాజ్, భద్రయ్య, రాజేష్, లక్ష్మయ్య, బాలకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

టీఎంసీ, మమతా బెనర్జీకి షాక్.. రాజీమానా చేసిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ..



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కి, ఆ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ ఇవాళ (గురువారం) రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు.ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100% లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మాన్‌ను కూడా ప్రదానం చేసింది. అనంతరం టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

ఇస్రోలో ఉద్యోగుల రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం

న్యూఢిల్లీ, జులై 16: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) కీలక నిర్ణయం తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్(విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (ఐూఅ)లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది.భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్లు'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించి రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది.ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్‌సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్‌సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది.ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీల్లో ముందున్నాయి.



ప్రతి ఓటు కీలకం- అర్హులకు ఎన్యూమరేషన్ ఫారం చేరాలి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



చుంచుపల్లి, జూలై 16 : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని తన నివాసంలో స్వయంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి, ఆ ఫారాన్ని బీఎల్ఓ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు ఎమ్మెల్యే పలు కీలక సూచనలు చేశారు. మండల పరిధిలోని ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క ఓటరు కూడా ఈ ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని సూచించారు. ఓటర్లకు ఫారాలపై లేదా ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే వాటిని ఓర్పుతో నివృత్తి చేస్తూ, ఫారాలను సకాలంలో సేకరించి ఎన్నికల అధికారులకు అందజేసేలా పనిచేయాలని బీఎల్ఓలకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని, కావునా ఓటరు జాబితా నుండి అర్హులు తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఓలపై ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను అందజేసి, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, గడువులోగా ఫారాలను తిరిగి సేకరించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలందరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములై బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని, ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా తిరిగి అందజేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ గణేష్, ఆర్ఐ నరసింహారావు, ఏఎంసీ జనార్దన్, వీఆర్వో బాలాజీ, వాసిరెడ్డి మురళి, బోడ రామకృష్ణ, బోసు కిశోర్ పాల్గొన్నారు.

వాంగ్‌చుక్‌కు అవసరమైన వైద్యసాయం అందించండి.. కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు



పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్య సాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్ ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది.రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈ దీక్ష చేస్తున్నారు.గడిచిన 18 రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరడం, ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. అవసరమైతే ఆయన్ను కాపాడటానికి వైద్య సాయం అందించాలని కేంద్రంతోపాటు ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది.

భూమి కోసం 35 ఏళ్ల పాటు పోరాటం చేసిన వృద్ధురాలు..

బిహార్: భారతదేశంలో ఏదైనా కేసు కోర్టుకు వెళ్లిందంటే తుది తీర్పు ఎప్పుడు వస్తుందా? అని ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఒక్కోసారి కేసు పెట్టుకున్న ఇరువర్గాల వారు మృతిచెందేంత వరకు ఆ కేసు పరిష్కారం కాదు. చివరికి ఇద్దరూ చనిపోవడంతో కేసులు కొట్టివేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. చాలా కేసులు దశాబ్దాల పాటు కొనసాగుతూ ఇరు వర్గాల వారిని వాయిదాల పేరుతో తిప్పుతూనే ఉంటాయి. దీనికి కేసుల సంఖ్య, కోర్టుల్లో సిబ్బంది కొరత వంటి అనేక కారణాలు ఉండొచ్చు. అయితే తాజాగా ఓ 103 ఏళ్ల వృద్ధురాలు కోర్టులో కేసు గెలవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అందులో వింతేముంది అనుకుంటున్నారా? దాదాపు 35 ఏళ్లపాటు పోరాటం చేసి ఆమె ఈ కేసులో విజయం సాధించారు. ఈ ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది.తూర్పు చంపారణ్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన హబీబన్ ఖాతూన్ (103)కు సుమారు 1,600 చదరపు అడుగుల స్థలం ఉంది. అయితే ఆ భూమిపై 1994 నుంచి వివాదం కొనసాగుతోంది. ప్రత్యర్థులు ఆ స్థలాన్ని తమదంటూ వాదించారు. దీంతో ఇరు వర్గాలు 1994లో సివిల్ కోర్టును ఆశ్రయించాయి. అప్పటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతూనే ఉంది. ఇరు వర్గాల సుదీర్ఘ వాదనలు పరిశీలించిన న్యాయస్థానం.. హబీబన్ ఖాతూన్‌కే ఆ భూమి చెందుతుందని తాజాగా తీర్పునిచ్చింది. వెంటనే దాన్ని ఆ వృద్ధురాలికి అప్పగించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ, స్థానిక పరిపాలన, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా గ్రామానికి చేరుకుని హబీబన్ ఖాతూన్‌కు భూమిని అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామంలో దప్పుళు మోగిస్తూ కోర్టు తీర్పును బహిరంగంగా ప్రకటించారు.భూ వివాదం సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామంలో దాదాపు 300 మంది పోలీసులు మోహరించారు. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లు, రెవెన్యూ అధికారులు, కల్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం

విజయవాడ, జూలై 16, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం.ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది.వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు.అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనావరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు

తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు. దీనివల్ల క్యాడర్‌లో ఒక విధమైన ఒంటరితనం, ఆవేదన గూడుకట్టుకుంటున్నాయి.ఈ పొలిటికల్ గ్యాప్‌ను భర్తీ చేయడానికి టీడీపీ హైకమాండ్ తక్షణమే ఒక ప్రత్యేకమైన, అత్యంత నమ్మకమైన అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీలోని సీనియర్ నేతలు లేదా పొలిట్‌బ్యూరో సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఎమ్మెల్యేలతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించాలి. తమ సమస్యలను క్లియర్ కట్‌గా చెప్పుకునే వేదిక ఉందని, తమ ఆందోళనలపై అధిష్ఠానం కచ్చితంగా యాక్షన్ తీసుకుంటుందనే గట్టి నమ్మకం ఎమ్మెల్యేలలో కలగాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో అసంతృప్తి చల్లారి, ప్రభుత్వం-పార్టీల మధ్య సమన్వయం కుదురుతుంది.పాలనలో మంచితనం, పారదర్శకత ఎంత ముఖ్యమో.. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న రాజకీయ సైనికులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను కట్టడి చేయకపోతే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తు రాజకీయాల్లో గానీ కూటమి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చంద్రబాబు-లోకేష్ ద్వయం ఇప్పటికైనా కిందిస్థాయి నేతల అంతర్గత ఆవేదనను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఒక పటిష్టమైన వేదికను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో, ఈ చిన్న చిన్న అసంతృప్తులే రాబోయే రోజుల్లో పెద్ద అంతర్గత కుమ్ములాటలకు దారితీసే ప్రమాదం ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం.

జగన్ ప్రస్టేషన్ అంతకు మించి



విజయవాడ, జూలై 16, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు.సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు.మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం ఆగ్రహంతికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు. ఆధారాలతో సహా దొరికిపోయిన తర్వాతే నిందితుడు లొంగిపోగా, అసలు ఆ 18 ఏళ్ల పిల్లోడిపై కేసు పెట్టడమే తప్పు అన్నట్లుగా జగన్ మాట్లాడటం వెనుక కేవలం రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాలే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.ఈ కేసులో నిందితుడిని వెనకేసుకురావడం ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక సూత్రాన్ని జగన్ రెడ్డి విస్మరించినట్లు స్పష్టమవుతోంది. నిందితుడు తమ పార్టీ నేత కుమారుడైనంత మాత్రాన, ఈ ప్రమాదంలో చనిపోయిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన గొర్రెల కాపరి ప్రాణానికి విలువే లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తికి చట్టాలపై కనీస అవగాహన లేకపోవడం, లేదా తెలిసి కూడా తప్పుడు కేసులను సమర్థించడం చూస్తుంటే ఆయన పూర్తి మైండ్ బ్యాలెన్స్ కోల్పోయారనడానికి ఈ విశాఖ పర్యటనే నిదర్శనంగా కనిపిస్తోంది.

అయోమయంలో అమరావతి రైతులు

విజయవాడ, జూలై 16,రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అత్యంత కీలకమైన ఉండవల్లి గ్రామంలోని సుమారు 2 ఎకరాల 77 సెంట్ల భూమిని ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కొందరు రైతులు, వారి వెనుక ఉన్న శక్తులు భీష్మించుకు కూర్చున్నప్పటికీ.. గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ముగియడంతో రెవెన్యూ, సీఆర్‌డీఏ యంత్రాంగం రంగంలోకి దిగి భూమిని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. దీంతో రాజధానిలో రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది.భూసేకరణ నిబంధనల ప్రకారం 10 మంది రైతులకు చెందిన ఈ 2.77 ఎకరాల భూమికి గాను ప్రభుత్వం మొత్తం రూ.7 కోట్ల 14 లక్షల భారీ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2 కోట్ల 58 లక్షల మేర నష్టపరిహారం లభిస్తుంది. శుక్రవారం రాత్రి సీఆర్‌డీఏ అధికారులు ఈ పరిహారానికి సంబంధించిన చెక్కులను నేరుగా రైతుల వద్దకు తీసుకువెళ్లినప్పటికీ, వారు వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. అభివృద్ధికి సహకరించకుండా ఉద్దేశపూర్వకంగానే వారు చెక్కులను తిరస్కరించడంతో.. అధికారులు సదరు పరిహారం మొత్తాన్ని చట్టప్రకారం ఎల్.ఎల్.ఆర్.ఆర్ అథారిటీలో డిపాజిట్ చేశారు. అనంతరం రంగంలోకి దిగిన ఏడీసీఎల్ , ఎన్‌సీసీ కంపెనీల సిబ్బంది పనులను ముమ్మరం చేసి, 24 గంటల్లో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధప్రతిపాదికన మట్టి పనులు జరుపుతున్నారు.అమరావతి ల్యాండ్ పూలింగ్‌కు మొదటి నుండి సహకరించకుండా కోర్టు స్టేలతో కాలయాపన చేసిన ఈ భూముల వెనుక పెద్ద ఎత్తున వైసీపీ నేతల రాజకీయ హస్తం ఉందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రైతుల మాదిరిగానే వీరు కూడా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి ఉంటే, వాటికి బదులుగా వచ్చే కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లను అమ్ముకున్నా ఎకరాకు సుమారు రూ.6 నుంచి 7 కోట్లకు పైగా వచ్చేది. కానీ, పూలింగ్ ఇవ్వకుండా కేవలం రూ.2.58 కోట్ల ప్రభుత్వ పరిహారానికి పరిమితం కావడం వెనుక వైసీపీ నేతల ఇన్‌సైడర్ ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులను

అడ్డుకుంటే ఇచ్చే ప్యాకేజీలు, రాజకీయ లబ్ధి ఎక్కువగా ఉంటుందనే ఆశతోనే సదరు నేతలు ఈ భూములను ముందే కొనుగోలు చేసి, రైతుల పేరుతో తెరవెనుక డ్రామాలు ఆడించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఆటంకంగా మారిన ఈ ల్యాండ్ పూలింగ్ వివాదంలో నోటీసులు ఇచ్చే వరకు మొత్తం 18 మంది రైతులు సుమారు 4 ఎకరాల మేర ఇవ్వకుండా మొండికేసారు. అయితే మారుతున్న పరిస్థితులు, లీగల్ చిక్కులను గమనించిన 8 మంది రైతులు ఇటీవలే తమ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. మిగిలిన 2.77 ఎకరాలకు సంబంధించి ఒక స్థానిక న్యాయవాది స్వయంగా భూమి ఇవ్వనని పట్టుబట్టడంతో, ఆయన మాటలు నమ్మి మిగతా 9 మంది రైతులు కూడా ఇన్నాళ్లూ భూములను ఆపారు. దీంతో శనివారం ఉదయం అధికారులు మొదట సదరు లాయర్‌కు చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే ఈ ఆపరేషన్ ప్రారంభించారు.

26 లక్షల ఓట్లపై గల్లంతు

విజయవాడ, జూలై 16,ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఇంకా కొంత పని మిగిలి ఉండటంతో గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం ను కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం మరో పది రోజుల అదనపు గడువును మంజూరు చేసింది. దీంతో మిగిలిన పనిని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మరింత చురుకుగా పనిచేస్తున్నారు.రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా గడువు పొడిగించాలన్న అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 88 శాతం సవరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు 12 శాతం పని మిగిలి ఉండగా, కొత్త గడువులో దానిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, వాటిని సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది.రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 14 నాటికి 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మరో 1.67 శాతం ఫారాల నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు.ఈ సవరణ ప్రక్రియలో కీలకమైన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో ఇప్పటికే మరణించిన 14 లక్షల 19 వేల 644 మంది పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధృవీకరణ పూర్తయిన తర్వాత ఈ పేర్లు జాబితా నుంచి తొలగించబడతాయి. అదే విధంగా ఉద్యోగాలు, వ్యాపారం లేదా ఇతర కారణాలతో శాశ్వతంగా ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిన వారి వివరాలను కూడా పరిశీలించారు.ఇప్పటికే 12 లక్షల 14 వేల 994 మంది శాశ్వతంగా ప్రాంతాలకు మారినట్లు గుర్తించిన అధికారులు, వారి ఓటు నమోదుపై కూడా తగిన చర్యలు చేపడుతున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారి సంఖ్య కలిపితే దాదాపు 26 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.మరో పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఇంకా మరికొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గడంతో పాటు, చెల్లని ఓట్లను తొలగించి మరింత పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమనే ఆశాభావాన్ని ఎన్నికల అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న ఎన్నికల నిర్వహణ మరింత విశ్వసనీయంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కేరళ రేంజ్ లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

విశాఖపట్టణం, జూలై 16, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

నల్లమల్లో వజ్రాల వేట

కర్నూలు, జూలై 16, నంద్యాల - ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు.నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటకిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు.నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది.నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలోని వజ్రకరూర్, కర్నూలు జిల్లాలోని తుగ్గిలి, జొన్నగిరి వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది తీర ప్రాంతాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. తొలకరి వర్షాలకు మట్టి కొట్టుకుపోయి వజ్రాలు బయటపడతాయని ప్రజలు భావిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో దొరికే వజ్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది.నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగు, రాళ్లవాగులో వర్షాకాలం వజ్రాల అన్వేషణ జోరుగా సాగుతుంది. గాజులపల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్వం స్వామి, అమ్మవార్ల కల్యాణానికి వజ్రాలను తలంబ్రాలుగా ఉపయోగించే వారని, అందుకే ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికే అవకాశం ఉందని ప్రజలు భావిస్తారు. కేవలం స్థానికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

టాటూ వేయించుకున్నారా..? అయితే మీకు గుడ్ న్యూస్



టాటూ అంటే శరీరంలోని చర్మంపై సూదితో రంగులను గుచ్చి వేయించుకునే ఒక రకమైన చిత్రం లేదా అక్షరం. ఇది ఒక రకమైన శరీర అలంకరణ. టాటూలు చాలా కాలం నుండి ప్రపంచంలోని వివిధ సంస్కృతులలో ఉపయోగించబడుతున్నాయి. అవి కొన్నిసార్లు ఆధ్యాత్మిక లేదా సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి.టాటూ వేయించుకోవడం ప్రధానంగా ఒక వ్యక్తిగత ఎంపిక. ఇది కళాత్మకంగాను, ఆత్మనిర్వచనంగాను ఒక వ్యక్తిని ప్రతిబింబిస్తుంది. దీని వల్ల వచ్చే లాభాలు ఎక్కువగా మానసికమైనవే. టాటూ వేయించుకోవడం వల్ల కలిగే కొన్ని లాభాలు: తమ శరీరంపై ఒక కళాఖండాన్ని మోసుకునే భావన చాలా మందికి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. టాటూ ఒక వ్యక్తి యొక్క విలువలు, అనుభవాలు, అభిరుచులను ప్రతిబింబిస్తుంది. ఇది తనను తాను గుర్తించుకోవడానికి ఒక మార్గం.ఒక ముఖ్యమైన సంఘటన, వ్యక్తి లేదా భావాన్ని జ్ఞాపకం చేసుకోవడానికి టాటూ ఒక శాశ్వతమైన మార్గం.అదే రకమైన టాటూలు ఉన్న వ్యక్తులతో కనెక్ట్ అవ్వడానికి ఇది ఒక మార్గం.టాటూలు ఒక రకమైన కళాత్మక అభివ్యక్తి. “ లోదుస్తులు ధరించి పడుకుంటే అంతే సంగతి..!” టాటూ వేయించుకోవడం వల్ల కలిగే కొన్ని నష్టాలు: అంటువ్యాధులు, అలర్జీలు వంటివి వచ్చే అవకాటం ఉంది.కొంతమంది తర్వాత తమ టాటూ గురించి పశ్చాత్తాపపడవచ్చు.కొన్ని వృత్తులలో టాటూలు అంగీకరించబడకపోవచ్చు. టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకునే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోండి: మీరు ఎంచుకునే డిజైన్ మీకు ఎంతకాలం నచ్చుతుందో ఆలోచించండి. అనుభవం ఉన్న, పరిశుభ్రమైన పద్ధతులను పాటించే ఆర్టిస్ట్‌ని ఎంచుకోండి.టాటూ వేయించుకోవాలనుకునే స్థానం కూడా ముఖ్యం.టాటూ వేయించుకున్న తర్వాత దానిని జాగ్రత్తగా చూసుకోవాలి. ముగింపు: టాటూ వేయించుకోవడం ఒక వ్యక్తిగత ఎంపిక. మీరు టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకుంటే, జాగ్రత్తగా ఆలోచించి, నమ్మకమైన టాటూ ఆర్టిస్ట్‌ను ఎంచుకోండి. అలాగే, టాటూ వేయించుకున్న తర్వాత సరైన జాగ్రత్తలు తీసుకోండి.

కుక్కలు ఆత్మహత్య చేసుకుంటాయని మీకు తెలుసా..?



కుక్కలు ఆత్మహత్య చేసుకుంటాయా అనే ప్రశ్న చాలా ఆసక్తికరమైనది. మనం సాధారణంగా ఆత్మహత్య అనేది మానవులకు సంబంధించిన విషయంగా భావిస్తాము. కానీ, కుక్కలు వంటి జంతువులు ఎందుకు ఇలాంటి ప్రవర్తనను ప్రదర్శిస్తాయనేది చాలా మందికి సందేహం. స్కాట్లాండ్‌లోని ఓవర్‌టౌన్ బ్రిడ్జి: ఈ విషయానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా చాలా కథనాలు ఉన్నాయి. వాటిలో ఒకటి స్కాట్లాండ్‌లోని ఓవర్‌టౌన్ బ్రిడ్జికి సంబంధించినది. ఈ బ్రిడ్జిని ‘డాగ్ సూసైడ్ బ్రిడ్జి’ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే, చాలా సంవత్సరాలుగా ఈ బ్రిడ్జి నుండి అనేక కుక్కలు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదికలు వచ్చాయి. “కుక్కలు ఎందుకు ఏడుస్తాయో తెలుసా..?” ఎందుకు ఇలా జరుగుతుంది? కొందరు ఈ బ్రిడ్జి యొక్క భౌగోళిక స్థితి, వాతావరణం వంటి కారణాల వల్ల కుక్కలు ఆకర్షితులవుతున్నాయని భావిస్తున్నారు.కొందరు కుక్కలు కొన్ని రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నాయని, అందుకే ఈ విధంగా ప్రవర్తిస్తున్నాయని అంటున్నారు.కొందరు కుక్కల యజమానుల ప్రవర్తన, వారి మానసిక స్థితి కూడా కుక్కల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు.నిజానికి ఏమి జరుగుతుందో ఇంకా తెలియదు.వీటిలో ఏ సిద్ధాంతం నిజమో ఇంకా స్పష్టంగా తెలియదు. ఈ విషయంపై పరిశోధకులు ఇంకా అధ్యయనం చేస్తున్నారు. 40 శాతం ఉన్న గిరిజనులు, ముస్లీంలే కీలకం ముఖ్యమైన విషయం: కుక్కలు ఆత్మహత్య చేసుకుంటున్నాయనే వార్తలను చూసి చాలామంది భయపడతారు. కానీ, ఈ విషయం గురించి అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కుక్కలు మానవుల లాగా భావిస్తాయి. వాటి ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

గాల్‌బ్లాడర్‌లో స్టోన్స్ ఎందుకు ఏర్పడతాయి..? సర్జరీ తప్పనిసరా..?

శరీరంలోని వివిధ భాగాల్లో ఈమధ్య రాళ్లు తయారు కావడం కామన్ అయిపోయింది. మూత్రపిండాలు, పిత్తాశయంలో స్టోన్స్ ఫార్మ్ కావడం గురించి తరచుగా వినబడుతున్నాయి. మొదటగా చిన్నగా మొదలై క్రమేపీ వీటి సైజ్ పెరుగుతూ పోతుంది. తద్వారా ఆయా శరీర భాగాల్లో అసౌకర్యంతో పాటు తీవ్రమైననొప్పి కలుగుతుంది. అవసరమైతే పరిస్థితి శస్త్రచికిత్స వరకు దారితీసే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ లేదా బిలిరుబిన్ స్థాయిలు పిత్తాశయంలో అధికంగా ఉన్నప్పుడు అక్కడ రాళ్లు ఏర్పడతాయి. వాటిని బయటకు పంపించడంలో పిత్తాశయం విఫలమయ్యే పక్షంలో అవి అక్కడే ఉండిపోయి సైజ్ పెరుగుతూ ఉంటాయి. తరచుగా అక్కడ రిలీజ్ అయ్యే కొలెస్ట్రాల్, కాల్షియం మరియు ఇతర ద్రవాల వల్ల రాళ్ల పరిమాణం మరియు కూర్పులో మార్పు ఉంటుంది. “పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?” గాల్ బ్లాడర్ లేదా పిత్తాశయంలో రాళ్ల సైజ్ పెద్దదైతే ఏకంగా ఆ భాగాన్ని సర్జరీ చేసి తీసివేయాలని వైద్యులు నిర్ణయిస్తారు. లాపరోస్కోపిక్ కోలిసిస్టెక్టమిగా పిలిచే ఈ చికిత్స.. నొప్పితో పాటు ఇతర ఆరోగ్య ప్రమాదాల నుంచి బయటపడేందుకు ఓ సురక్షితమైన ప్రక్రియగా చెప్పవచ్చు. అయితే ఈ సమస్యకు ఖచ్చితంగా శస్త్రచికిత్స అవసరం ఉంటుందని చెప్పలేము. పిత్తాశయం వాపు, గాయం, దీర్ఘకాలిక మంట, క్యాన్సర్ లేదా సాధారణ కణితులు ఏర్పడిన సందర్భాల్లో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి దాన్ని తొలగించాల్సి ఉంటుంది. అయితే దీన్ని నిర్ధారించేందుకు మందుగా కొన్ని పరీక్షలు లేదా ప్రక్రియలు జరపాల్సిన అవసరం ఉండవచ్చు. ఇన్ఫెక్షన్ లేదా కాలేయ సమస్యలను తనిఖీ చేసేందుకు రక్త పరీక్ష,



చెస్ట్ అల్ట్రాసౌండ్, ఉ స్కాన్‌లను రిఫర్ చేయవచ్చు. 40 శాతం ఉన్న గిరిజనులు, ముస్లీంలే కీలకం । లాపరోస్కోపిక్ పద్ధతి ద్వారా సాధారణంగా పిత్తాశయం తొలగింపు చేపడతారు. ఇందులో ఒక సెంటీమీటర్ కంటే తక్కువ సైజ్‌లో చిన్న హోల్ చేస్తారు. తద్వారా తక్కువ నొప్పితో పాటు త్వరగా కోలుకుని సాధారణ రోజువారీ పనులు చేసుకోవచ్చు. చాలా మంది రోగులు సర్జరీ అనంతరం కేవలం 4-6 గంటలలోపు నడవగలరు. 24 నుంచి 48 గంటలలోపు డిశ్చార్జ్ కావచ్చు. ఓపెన్ సర్జరీ అనేది నేడు చాలా అరుదుగా జరుగుతుంది.

దోమల బెడదను నివారించే వంటింటి చిట్కాలు.. ఇలా చేస్తే పరార్..!

దోమలు అనేవి ప్రతి ఇంట్లోనూ సాధారణ సమస్య. ఇవి ఆరోగ్యానికి ప్రమాదకరమైన జబ్బులను వ్యాప్తి చేస్తాయి. అందుకే వీటిని నివారించడం చాలా ముఖ్యం. ఎటువంటి రసాయనాలను ఉపయోగించకుండా సహజసిద్ధమైన పద్ధతులతో దోమలను నశింపజేయవచ్చు. వంటింట్లో అందుబాటులో ఉండే కొన్ని చిట్కాలతో దోమల సమస్యను సులభంగా తగ్గించుకోవచ్చు. 1. లవంగాలు లవంగాలు – నిమ్మరసాన్ని మిక్స్ చేసి దోమలు ఉండే ప్రదేశాల్లో ఉంచండి. దీని వాసన దోమలను తట్టుకోలేకపోతుంది. లవంగపు గింజలను నీటిలో ఉడికించి ఆ నీటిని ఇంట్లో అటూ ఇటూ చల్లుకోవచ్చు. లవంగపు నూనెను దీపం వెలిగించేటప్పుడు కొన్ని చుక్కలు వేయవచ్చు. ఇలా చేయడం వల్ల దోమల బెడద తగ్గుతుంది. “కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే కిడ్నీలో రాళ్లు వస్తాయా? “ 2. నిమ్మరసం, నిమ్మకాయ తొక్కల ఉపయోగం దోమలను ఆకర్షించకుండా చేయడానికి నిమ్మరసాన్ని నీటిలో కలిపి ఇళ్ల మూలల్లో చల్లి చూడండి. నిమ్మకాయ తొక్కలను దొమలు ఎక్కువగా చేరే ప్రదేశాల్లో ఉంచితే అవి దూరంగా ఉంటాయి. 3. వెల్లుల్లి నీరు వెల్లుల్లి రెబ్బలను కోసి గదిలో ఉంచడం ద్వారా దోమలను దూరం చేయవచ్చు. వెల్లుల్లిని నీటిలో మరిగించి ఆ నీటిని గదుల్లో స్ప్రే చేయండి. వెల్లుల్లి వాసన దోమలను దూరంగా ఉంచుతుంది. కర్పూరాన్ని చిన్న పాత్రలో వెలిగించి గదిలో ఉంచితే దొమలు మరణిస్తాయి. 4. తులసి తులసి ఆకులను నీటిలో ఉడికించి ఆ నీటిని స్ప్రే చేయవచ్చు. ఈ మొక్కలను ఇంట్లో పెంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చు. తులసి మొక్కను ఇంటి ముందు పెంచడం వల్ల కూడా దొమలు ఇంట్లోకి రావు. తులసి ఆకుల రసం దోమలను ఆకర్షించకుండా చేస్తుంది. “ఈ ఆకుల రసం తాగండి... జీవితంలో మోకాళ్ల నొప్పులు రావు” 5. లెమన్ గ్రాస్ లెమన్ గ్రాస్ నూనెను దీపం వెలిగించేటప్పుడు కొన్ని చుక్కలు వేయవచ్చు. లెమన్ గ్రాస్ ఆకులను నీటిలో ఉడికించి ఆ నీటిని స్ప్రే చేయవచ్చు. వేప నూనెను నీటిలో కలిపి గదుల్లో స్ప్రే చేస్తే దోమలు దూరంగా ఉంటాయి. 6. కాఫీ పొడి వంటింట్లో ఉన్న కాఫీ పొడి దోమలను మటుమాయం చేయడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నీటి నిల్వ ప్రాంతాల్లో కాఫీ పొడిని చల్లితే దోమ గుడ్లు పగిలిపోతాయి. అదే విధంగా నిమ్మపొడి లేదా వేప పొడిని దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చల్లితే అవి దూరంగా ఉంటాయి. 7. నీలగిరి నూనె నీలగిరి నూనెను కొబ్బరి నూనెతో కలిపి చర్మంపై రాసుకుంటే దోమలు దూరంగా ఉంటాయి. ఈ నూనెను నీటిలో కలిపి స్ప్రే చేయడం ద్వారా కూడా మంచి ఫలితాలు వస్తాయి. పుదీనా ఆకులను మరిగించి, ఆ నీటిని గదుల్లో స్ప్రే చేస్తే దోమలు ఇంట్లో ఉండవు. “చింత గింజలతో ఎంత ఆరోగ్యమో తెలిస్తే అస్సలు పారెయ్యరు!” నివారణకు చిట్కాలు: నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచండి. ఇంట్లో వాతావరణాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల సమస్య తగ్గుతుంది. కిటికీలకు దోమల చందుల్లుఅమర్చడం మేలు. ఈ సహజ పద్ధతులను పాటించడం ద్వారా దోమలను దూరంగా ఉంచుకోవచ్చు . కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



ఎక్కిళ్ళు ఆరోగ్య సమస్యలకు సంకేతమా?.. అన్నం తినేటప్పుడు వస్తే ?

ఎక్కిళ్లు అనేవి శరీరంలో డయాఫ్రాగమ్ అనే కండరానికి సంబంధించి జరగే అనియంత్రిత చర్య. ఇది ఊపిరితిత్తుల కింద ఉండే కండరమై, శ్వాసకు సహాయపడుతుంది. డయాఫ్రాగమ్ అకస్మాత్తుగా సంకోచించడం వలన శ్వాసనాళం అకస్మాత్తుగా మూసుకుపోయి ఎక్కిళ్లు వస్తాయి. ఈ శబ్దం అనేది గ్లోటిస్ నే భాగం అకస్మాత్తుగా మూసుకుపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. ఎక్కిళ్లు ఎందుకు వస్తాయి? ఎక్కిళ్లు అనేవి అనేక కారణాల వల్ల కలగవచ్చు. వేగంతో అన్నం తినడం వల్ల గాలి కూడా ఎక్కువగా పేగులలో చేరుతుంది, ఇది ఎక్కిళ్లకు దారితీస్తుంది. బిగ్గరగా నవ్వడం, వేగంగా తినడం, లేదా చల్లటి పానీయాలను తాగడం వల్ల ఎక్కువ గాలి మింగబడుతుంది. ఇలాంటి సమయంలో ఎక్కిళ్లు వచ్చే అవకాశం ఉంది. కారం ఎక్కువగా ఉన్న ఆహారం, లేదా శరీరానికి అలెర్జీ కలిగించే పదార్థాలు తీసుకుంటే ఎక్కిళ్లు వస్తాయి. మానసిక ఒత్తిడి లేదా భావోద్వేగాలు కూడా ఎక్కిళ్లకు కారణమవుతాయి. కొన్ని విటమిన్లు , ఖనిజాల లోపం కూడా డయాఫ్రాగమ్‌కు ఇబ్బంది కలిగించవచ్చు. “కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే కిడ్నీలో రాళ్లు వస్తాయా? “ అన్నం తినేటప్పుడు ఎక్కిళ్లు రావడం అన్నం తినేటప్పుడు ప్రత్యేకంగా ఎక్కిళ్లు రావడానికి ప్రత్యేకమైన కారణాలు ఉన్నాయి. చిన్నగా నమిలి తినకుండా పెద్ద ముక్కలు మింగడం వల్ల గాలి ఊపిరితిత్తుల్లోకి చేరుతుంది. తిన్న ఆహారపు ఉష్ణోగ్రత డయాఫ్రాగమ్‌ను ప్రభావితం చేయవచ్చు. తినేటప్పుడు తగినంత నీరు తీసుకోకపోతే ఆహారం తేలికగా దిగదు, ఇది ఎక్కిళ్లకు కారణం అవుతుంది. ఎక్కిళ్లను తగ్గించే చిట్కాలు చిన్నగా చల్లటి నీటిని మెల్లగా తాగితే ఎక్కిళ్లు తగ్గుతాయి. ఒకసారి లోతుగా శ్వాస తీసుకుని కొంతసేపు ఆపి విడుదల చేయడం వల్ల ఎక్కిళ్లు తగ్గుతాయి. ఒక స్పూన్ తేనెను నోట్లో ఉంచి మెల్లగా మింగడం ఉపశమనం ఇస్తుంది. ఎక్కిళ్లు వచ్చినప్పుడు తినే ప్రక్రియను తాత్కాలికంగా ఆపి కొన్ని నిమిషాలు వేచి చూస్తే ఫలితం ఉంటుంది. ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి? ఎక్కిళ్లు సాధారణంగా తక్కువ సేపులో తగ్గిపోతాయి. అయితే, అవి గంటల తరబడి లేదా రోజులు పాటు కొనసాగితే, అది ఓ శరీర సంబంధ సమస్యకు సంకేతం కావచ్చు. అందువల్ల వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ఎక్కిళ్లు చిన్న సమస్యగా కనిపించినప్పటికీ, కొన్ని జాగ్రత్తలతో అవి పూర్తిగా నివారించవచ్చు. నమిలి తినడం, ఆహారాన్ని సరిగా తీసుకోవడం వంటి అలవాట్లతో ఎక్కిళ్లను తగ్గించుకోవడం సాధ్యం.



స్పోర్ట్స్ న్యూస్

వారిని నేల మీదకు దించాలి.. గంభీర్‌కు ఏబీ డివిల్లీర్స్ కీలక సూచన..



ఇటీవలి యూకే పర్యటనలో టీమిండియా వరుసగా టీ-20 సిరీస్‌లను కోల్పోయిన నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్‌కు దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిల్లీర్స్ కీలక సూచన చేశాడు. ప్రస్తుతం టీమిండియాలో స్టార్లుగా చెలామణి అవుతున్న యువ ఆటగాళ్లను నేల మీదకు దించాలని సూచించాడు. లేకపోతే భారత క్రికెట్ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించాడు'వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ వంటి అసాధారణ ప్రతిభ కలిగిన బ్యాటర్లు టీమిండియాలో ఉన్నారు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో దీర్ఘకాలం రాణించాలంటే కేవలం ప్రతిభ సరిపోదు. క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, సరైన మార్గదర్శకత్వం కూడా అవసరం. యువ ఆటగాడిని అతిగా పొగడకూడదు. అతడు ఇంకా నేర్చుకునే దశలో ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ డివిల్లీర్స్ పేర్కొన్నాడు'ఐపీఎల్‌లో ఎన్నో పరుగులు చేసిన ఆటగాళ్లను ఈ పరాజయాలు వాస్తవంలోకి తీసుకువస్తాయి ఇది అంతర్జాతీయ క్రికెట్ అని వారు అర్థం చేసుకోవాలి. ఇక్కడ బలహీనతకు తావు లేదు. ఐపీఎల్‌లో, మనం పరుగులు చేయగలమని భావించే ఒకరిద్దరు బౌలర్లు ఎప్పుడూ ఉంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లో దాక్కోవడానికి చోటు ఉండదు. కాబట్టి మీకు ఒకటి, రెండు కంటే ఎక్కువ గేర్లు అవసరం. మీరు ఎల్లప్పుడూ ఐదో గేర్‌లో బ్యాటింగ్ చేయలేరు' అని డివిల్లీర్స్ పేర్కొన్నాడు.

ఫైనల్‌కి అర్జెంటీనా.. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై గెలుపు..



చిరకాల ప్రత్యర్థి ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. వరుసగా రెండో సారి ఫైనల్ బరిలోకి అడుగుపెట్టింది. చివరి క్షణాల్లో అద్భుతంగా పుంజుకున్న అర్జెంటీనా.. ఇంగ్లండ్‌పై 2-1తో విజయాన్ని సాధించింది. జులై 19న జరగబోయే మెగా ఫైనల్‌లో స్పెయిన్‌తో తలపడనుంది మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడినా తొలి అర్ధభాగంలో గోల్ నమోదు కాలేదు. మ్యాచ్ 55వ నిమిషంలో ఆంథోనీ గోర్డన్ ఒక గోల్ సాధించడంతో ఇంగ్లండ్‌కు ఆధిక్యం లభించింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ రక్షణ పటిష్ఠంగా కనిపించడంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరుతుందనే భావన నెలకొంది. అయితే చివరి నిమిషాల్లో అర్జెంటీనా తన ఆటను పూర్తిగా మార్చేసింది. 85వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ గోల్ సాధించి స్కోరును సమం చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారిందిఇక, ఆ తర్వాత అదనపు సమయంలో లియోనెల్ మెస్సి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను లౌటారో మార్టినెజ్ హెడ్డర్‌తో గోల్‌గా మలిచి అర్జెంటీనాకు చరిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ లియోనాల్ మెస్సి తన అనుభవాన్ని అంతా ఉపయోగించి ఆడాడు. కీలక సమయంలో మెస్సి అందించిన అసిస్ట్ అర్జెంటీనా విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో కూడా ముందున్నాడు.జులై 19వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో అర్జెంటీనా తలపడనుంది ఆ మ్యాచ్‌లో కూడా సత్తా చాటి వరుసగా రెండో టైటిల్ సాధించాలని అర్జెంటీనా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరోవైపు టోర్నీ ఆసాంతం జోరు కనబరిచిన స్పెయిన్ కూడా టైటిల్‌పై కన్నేసింది. ఈ పోరు కోసం ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జాక్ పాట్ కు అడుగు దూరంలో టీమిండియా స్టార్-



ఐసీసీ ప్రకటించిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కోసం పోటీ అత్యంత ఆసక్తికరంగా మారింది. టీమిండియా కెప్టెన్, స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ప్రపంచ నంబర్ వన్ ర్యాంకుకు చాలా చేరువ అయ్యాడు. ప్రస్తుతం ఈ ఫార్మాట్ బ్యాటింగ్‌లో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతని కంటే గిల్ 11 రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుకంజలో ఉన్నాడు. ఇంకొక్క మంచి ఇన్నింగ్ ఆడితే.. ఆ లోటు కాస్తా భర్తీ అవడం గ్యారంటీ. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి వన్డేలో గిల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను విజేతగా నిలిపాడు. టాప్ ఆర్డర్ వైఫల్యంతో భారత్ కష్టాల్లో పడిన సమయంలో జట్టును ముందుండి నడిపించాడు. 75 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 80 పరుగులు చేశాడు. కండరాల నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినప్పటికీ జట్టును పట్టాలెక్కించగలిగాడు. ఈ మ్యాచ్ ద్వారా గిల్ అదనంగా 12 రేటింగ్ పాయింట్లు సాధించాడు. అటు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో డారిల్ మిచెల్ కూడా కూడా రాణిస్తోండటంతో నంబర్ వన్ స్థానం కోసం వీరిద్దరి మధ్య ఓ పెద్ద ప్రచ్ఛన్న యుద్ధమే సాగుతోన్నట్టనిపిస్తోంది. మొత్తంగా మిచెల్ 814 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. 803తో శుభ్ మన్ గిల్ రెండో స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత 3, 4 స్థానాల్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఉన్నారు. విరాట్ కోహ్లీ వద్ద ఉన్న పాయింట్ల సంఖ్య.. 757. అతనికి అతి సమీపంలో ఉన్నాడు రోహిత్ శర్మ. అతని ఖాతాలో ఉన్న పాయింట్లు 744.

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్.. క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లిన భారత షట్లర్



భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ.. క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ(చైనా)పై సింధు ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది.ప్రస్తుతం పదో ర్యాంక్‌లో ఉన్న సింధు.. కేవలం 35 నిమిషాల్లోనే 21-16, 21-14 స్కోరుతో వరుస గేమ్‌ల్లో గెలిచి ప్రత్యర్థిపై సత్తాచాటింది. తొలి గేమ్‌లో ఆరంభంలో కాస్త వెనుకబడినప్పటికీ, మళ్లీ లయ అందుకుంది. ఆ తర్వాత వరుస పాయింట్లు సాధిస్తూ ఆధిపత్యం చెలాయించింది. ఇక.. రెండో గేమ్‌లో అయితే ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా రెచ్చిపోయిన భారత స్టార్ షట్లర్ 8-0 ఆధిక్యంతో మ్యాచ్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుని అలవోక విజయం సాధించింది. ఈ విజయంతో హాన్ యూపై సింధు తన హెడ్ టూ హెడ్ రికార్డును 8-1కు మెరుగుపరుచుకుంది. ఈ సీజన్‌లో సింధు నమోదు చేసిన అత్యుత్తమ విజయాల్లో ఇదొకటిగా నిలిచింది.ఇక.. క్వార్టర్ ఫైనల్లో సింధు జపాన్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమీ ఒకుహరాతో తలపడనుంది. టాప్ క్రీడాకారిణి ఆన్ సె-యంగ్(దక్షిణ కొరియా) గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో ఒకుహరాకు వాకోవర్ లభించింది. ప్రస్తుతం.. టోర్నీలో మిగిలిన ఏకైక భారత ప్లేయర్ సింధు కావడంతో అభిమానుల ఆశలన్నీ ఆమెపైనే ఉన్నాయి.

వివాదాస్పద బ్యానర్ ప్రదర్శించిన అర్జెంటీనా ప్లేయర్లు.. చర్యలు తీసుకోనున్న ఫిఫా



అట్లాంటా: ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు .. బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్లు జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ లీడింగ్



న్యూయార్క్: అర్జెంటీనా స్టార్ ప్లేయర్ ఫిఫా వరల్డ్‌కప్‌లో తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరుగాంచిన మెస్సీ తన మ్యాజిక్ గేమ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లోనూ మెస్సీ తన ట్యాలెంట్ ప్రదర్శించారు. రెండు అసిస్ట్‌లు ఇచ్చి.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే వరల్డ్‌కప్ టోర్నీలో ఇచ్చే గోల్డెన్ బూట్ అవార్డు రేసులో ప్రస్తుతం అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీ ముందున్నారు. మెస్సీ ఖాతాలో 8 గోల్స్, 4 అసిస్ట్‌లు ఉన్నాయి. దీంతో అతను అడిడాస్ గోల్డెన్ బూట్ అవార్డు రేసులో దూసుకెళ్లుతున్నాడు.అయితే ఫ్రాన్స్‌ను సెమీస్ వరకు తీసుకెళ్లిన ఆ జట్టు కెప్టెన్ కైలియన్ ఎంబాపే కూడా మెస్సీ వెనుకే దూసుకొస్తున్నాడు. ఎంబాపే ఖాతాలో 8 గోల్స్ , మూడు అసిస్ట్‌లు ఉన్నాయి. గోల్డెన్ బూట్ కోసం రెండో స్థానంలో ఎంబాపే ఉన్నాడు. నార్వేకు చెందిన ఎర్లింగ్ హాలాండ్, ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్.. కేన్, ఫ్రాన్స్ ప్లేయర్ డెంబ్లే, స్పెయిన్ ప్లేయర్ ఒయర్‌జెబల్ తర్వాత స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్‌పై ఊహించని రీతిలో కోలుకుని అర్జెంటీనా విక్టరీ నమోదు చేయడంతో గోల్డెన్ బూట్ రేసులో ముందు వరసలోకి వచ్చేశాడు. వాస్తవానికి ఎంబాపే, మెస్సీ మధ్య గోల్స్ సంఖ్య సమంగా ఉన్నా.. అసిస్ట్‌ల సంఖ్యలో మెస్సీ ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో గోల్డెన్ బూట్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇక మూడో స్థానం కోసం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో ఫ్రాన్స్ తలపడనున్నది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఎంబాపే గోల్స్ చేస్తే, అప్పుడు పరిస్థితి మారే అవకాశం ఉంటుంది.

19 ఏళ్ల క్రితం స్నానం చేయించిన చిన్నారి.. ఇప్పుడు ప్రపంచకప్ ఫైనల్లో మెస్సీకి ప్రత్యర్థి!

ఫుట్‌బాల్ ప్రపంచంలో అరుదైన సంఘటనకు ఫిఫా ప్రపంచకప్-2026 ఫైనల్ వేదిక కానుంది. 19 ఏళ్ల క్రితం అర్జెంటీనా దిగ్గజ ఆటగాడు మెస్సి తన చేతులతో స్నానం చేయించిన ఓ చిన్నారి, ఇప్పుడు ప్రపంచకప్ ఫైనల్లో అతడికే ప్రత్యర్థిగా నిలుస్తున్నాడు. ఆ చిన్నారి మరెవరో కాదు.. స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్. మరోవైపు అతడికి ఎదురుగా నిలిచేది అర్జెంటీనా దిగ్గజం మెస్సి 2007లో బార్సిలోనాలో నిర్వహించిన యునిసెఫ్ స్వచ్ఛంద కార్యక్రమం కోసం క్యాలెండర్ ఫొటోషూట్ ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో యువ మెస్సి, అప్పటికి కేవలం కొన్ని నెలల వయసున్న లామిన్ యమాల్‌కు స్నానం చేయిస్తూ ఫొటోలకు పోజులిచ్చాడు. ఆ సమయంలో ఈ చిన్నారి భవిష్యత్తులో ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్‌గా ఎదుగుతాడని ఎవరూ ఊహించి ఉండరు. ఫుట్‌బాల్ అంటే విపరీతంగా ఇష్టపడే ఆ చిన్నారి అంచెలంచెలుగా ఎదిగి స్పెయిన్ జట్టులో స్థానం సంపాదించాడు క్లబ్, దేశం తరఫున ఆడుతున్న యమాల్ రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతూ దూసుకుపోతున్నాడు ఫుట్‌బాల్ తర్వాతి తరం సూపర్‌స్టార్‌గా ఎదుగుతున్నాడు. ఒకప్పుడు తనకు స్నానం చేయించిన దిగ్గజ ఆటగాడికి ప్రత్యర్థిగా యమాల్ ఫిఫా ప్రపంచకప్ ఆడబోతున్నాడు. జులై 19వ తేదీన అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య ఫిపా ప్రపంచకప్-2026 ఫైనల్ మ్యాచ్ జరగబోతోంది.



సినిమా

కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా 'వెంకట్రామయ్య గారి తాలూకా' మూవీ ప్రీ రిలీజ్

తెలంగాణ ఉద్యమకారిణి కోమలి సినిమాను ఆదరించాలి: కల్వకుంట్ల కవిత
చిన్న సినిమాలకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలి: కల్వకుంట్ల కవిత
"ఒక ఆడబిడ్డ కన్నీటి కథే ఈ సినిమా" ?నిర్మాత కోమలి



ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన భావోద్వేగ కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు దశరథ్, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

"చిన్న సినిమాలకు మా పార్టీ అండగా ఉంటుంది" ? కల్వకుంట్ల కవిత

ముఖ్య అతిథి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. తెలంగాణలో చిన్న సినిమాల అభివృద్ధికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగు సినిమాల మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

"కుటుంబ భావోద్వేగాలతో కూడిన అద్భుతమైన సినిమా" ? దర్శకుడు దశరథ్

దర్శకుడు దశరథ్ మాట్లాడుతూ, కోమలి ఎంతో అంకితభావంతో ఈ చిత్రాన్ని నిర్మించారని అన్నారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందని, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

×మానవ సంబంధాల విలువను గుర్తు చేసే కథ×

ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, తండ్రి-పిల్లల అనుబంధం వంటి అంశాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ చిత్రం ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసేలా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

ప్రస్తుతం డబ్బు చుట్టూ తిరుగుతున్న సమాజంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృదయానికి హత్తుకునే విధంగా ఈ చిత్రంలో చూపించినట్లు పేర్కొన్నారు.

×''గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లు వచ్చాయి" ? మురళీధర్ గౌడ్×

ప్రధాన పాత్రధారి మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ, తన సినీ జీవితంలో ఎంతో కాలంగా చేయాలనుకున్న పాత్ర ఈ చిత్రంలో లభించిందన్నారు. "డీజే టిల్లు" తర్వాత తనకు అత్యంత సంతృప్తినిచ్చిన పాత్ర ఇదేనని చెప్పారు. వెంకట్రామయ్య పాత్రలో నటిస్తున్నప్పుడు గ్లిజరిన్ అవసరం లేకుండానే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. ఈ సినిమా ప్రతి ఒక్కరి గుండెను తాకుతుందని, మానవ సంబంధాల విలువను గుర్తు చేస్తుందని అన్నారు.

"ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ" ? నిర్మాత కోమలి మహేందర్ తొట్టె

నిర్మాత కోమలి మహేందర్ తొట్టె మాట్లాడుతూ, ఇది తన నిజ జీవిత అనుభవాల ఆధారంగా రూపొందించిన చిత్రమని తెలిపారు.

"ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ. నా జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ చిత్రంగా మలిచాను. నా భర్త సహకారం, మా గ్రామ ప్రజల ప్రోత్సాహంతో ఈ సినిమా నిర్మించగలిగాను. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ చిత్రాన్ని పూర్తి చేశాం. సినిమా చూస్తున్నంతసేపు కంటతడి పెట్టకుండా ఎవరూ బయటకు రారని నమ్ముతున్నాను. నన్ను జానపద గాయనిగా ప్రోత్సహించిన మానుకోట ప్రసాద్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. జూలై 17న ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి మా సినిమాను చూసి ఆశీర్వదించాలి" అని కోరారు.

"ప్రతి కుటుంబంలో జరిగే కథ" ? సీనియర్ నటి సుధ

సీనియర్ నటి సుధ మాట్లాడుతూ, కోమలి ఒక మహిళగా ఎన్నో కష్టాలు భరిస్తూ తన సొంత సంపాదనతో సినిమా నిర్మించడం గొప్ప విషయమన్నారు. ప్రతి కుటుంబంలో జరిగే కథను ఈ సినిమాలో చూపించారని, ప్రేక్షకులు తప్పకుండా తమ జీవితాన్ని ఇందులో చూసుకుంటారని తెలిపారు. కొత్త నిర్మాతగా కోమలి చేసిన ప్రయత్నాన్ని ఆదరించాలని కోరారు.

×"పెద్దలకు గౌరవం ఇవ్వాలనే సందేశం" ? దర్శకుడు సతీష్ ఆవాల×

దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం గొప్ప సంప్రదాయమని, కుటుంబాల్లో తలెత్తే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ చిత్రం చూపిస్తుందని అన్నారు.

తాను జర్నలిజం నుంచి వచ్చిన వ్యక్తినని, కుటుంబ బంధాల విలువ బాగా తెలుసని చెప్పారు. సోషల్ మీడియాలో దివిజ వీడియోలు చూసి ఈ పాత్రకు ఆమె సరిపోతుందని భావించి ఈటీవీ ప్రభాకర్‌ను సంప్రదించినట్లు తెలిపారు. మురళీధర్ గౌడ్, సుధ సహా ప్రతి నటుడు ప్రాణం పెట్టి నటించడంతో సినిమా అద్భుతంగా వచ్చిందన్నారు.

×"ఆరు పాటలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి" ? చరణ్ అర్జున్×

సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ, జానపద గాయని కోమలి నిర్మాతగా సినిమా నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె పట్టుదల గొప్పదని కొనియాడుతూ, ఈ చిత్రంలోని ఆరు పాటలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయని తెలిపారు.

×"హార్ట్ టచ్ చేసే సినిమా" ? హీరో దినేష్ కుమార్×

హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ, చిన్న గ్రామం నుంచి వచ్చిన కోమలి ఈ స్థాయి సినిమా నిర్మించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని తాకే కథతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఇందులో ఉన్నాయని తెలిపారు.

×"అందరికీ నచ్చే కథ" ? హీరోయిన్ దివిజ ప్రభాకర్×

హీరోయిన్ దివిజ ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ చిత్ర కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. యూనిట్ సభ్యులంతా ఎంతో అంకితభావంతో పనిచేశారని, నిర్మాత కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. జూలై 17న థియేటర్లలో సినిమా చూసి ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

×"స్టోరీ విన్న వెంటనే ఏడ్చేశాను" ? జబర్దస్త్ సత్యశ్రీ×

నటి జబర్దస్త్ సత్యశ్రీ మాట్లాడుతూ, తన పాత్ర, కథ విన్న వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్పారు. అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాతలకు ధన్యవాదాలు తెలుపుతూ, సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

×జూలై 17న ప్రేక్షకుల ముందుకు×

చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, మంచి కథ ఎప్పటికీ ప్రేక్షకులను కదిలిస్తుందని, జూలై 17న థియేటర్లలో విడుదల కానున్న "వెంకట్రామయ్య గారి తాలూకా"ను కుటుంబ సమేతంగా చూసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

రెబెల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన 'కొరియన్ కనకరాజు' మూవీ టీజర్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్టైనర్ 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే భారీ అంచనాలను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్ ఆసక్తిని రేకెత్తించగా, ఫస్ట్ సింగిల్ 'కంసనిద' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈరోజు రెబెల్ స్టార్ ప్రభాస్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేశారు.

టీజర్ ప్రారంభంలో కనకరాజు వాయిస్ ఓవర్‌తో తన రాయలసీమలోని పెనుకొండ ఊరిని పరిచయం చేస్తాడు. అల్లరి, సరదాగా తిరిగే కనకరాజు జీవితం ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఊహించని మలుపు తిరుగుతుంది. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ రహస్యమైన పాత్రతో పాటు అతీంద్రియ శక్తులు కూడా వస్తాయి. ఆ కొరియన్ ఆత్మ కనకరాజును ఆవహించడంతో అతను 'కొరియన్ కనకరాజు' గా మారిపోతాడు. అక్కడి నుంచి కామెడీ, యాక్షన్, హారర్, ఫాంటసీ అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది.

వరుణ్ తేజ్ కనకరాజు పాత్రలో చాలా సహజంగా ఒదిగిపోయారు. ముఖ్యంగా రాయలసీమ యాసను ఆయన వలికిన తీరు చాలా సహజంగా అనిపిస్తుంది. లాంగ్ హెయిర్ లుక్‌లో మాస్ అప్పీల్‌తో ఆకట్టుకున్న ఆయన, చివర్లో కొరియన్ కనకరాజుగా కనిపించే గెటప్ విజిల్స్ వేయించేలా ఉంది. ముఖ్యంగా సత్యతో కలిసి వచ్చే కామెడీ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. కొరియన్ అమ్మాయి పాత్రలో రితికా నాయక్ కూడా చాలా అందంగా కనిపించారు.

దర్శకుడు మేర్లపాక గాంధీ తన కామెడీ టేకింగ్‌తో ఆకట్టుకున్నారు. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని చక్కగా బ్లెండ్ చేస్తూ వినోదాత్మకంగా కథను తెరకెక్కించిన తీరు ఆసక్తిని పెంచుతుంది. రూరల్ కామెడీ, హారర్, ఫాంటసీ, యాక్షన్ అంశాలను బ్యాలెన్స్ చేస్తూ టీజర్ అదిరిపోయింది.

మనోజ్ రెడ్డి కటసాని సినిమాటోగ్రఫీ రాయలసీమ అందాలను, కొరియాలోని కలర్ ఫుల్ లొకేషన్లను ఎంతో అందంగా చూపించింది. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు మరో ప్రధాన బలం. హారర్, కామెడీ, యాక్షన్, ఫాంటసీ ఎమోషన్స్‌ను సంగీతంతో బాగా ఎలివేట్ చేశారు. సత్య జి ఎడిటింగ్ కూడా ఆసక్తికరంగా సాగింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లో ఉన్నతంగా కనిపిస్తున్నాయి.

'కొరియన్ కనకరాజు' టీజర్ హారర్, కామెడీ, యాక్షన్, ఫాంటసీ అంశాలను వినోదాత్మకంగా పరిచయం చేస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. కొత్త కాన్సెప్ట్, ఆకట్టుకునే విజువల్స్, కమర్షియల్ ట్రీట్‌తో ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నటీనటులు: వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య

రాకాను వదులుకున్న ప్రీతి ముకుందన్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లస్ట్'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో వలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.

అప్పుడు మహేశ్‌బాబు స్టార్‌డమ్ గురించి తెలియదు

హీరోయిన్ కృతిసనన్ సంచలన విషయాలు వెల్లడి

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ ' నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో? అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అభిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు.నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

జన నాయగన్ విడుదలకు సిద్ధం



విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844